

RNI NO: APTEL/25/A4894

ఉషశ్రీ
USHASRI తెలుగు దినపత్రిక

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక
సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిస్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377

సంపుటి : 01 | సంచిక : 64 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిల్ల మోహన్ | గురువారం 14 - 05 - 2026 | పేజీలు : 08 | వెల : రూ.2/-

Published From : Visakhapatnam Vijayawada Guntur Tirupati Kurnool Nellore Rajahmundry Kakinada Anantapur Kadapa Eluru Ongole Srikakulam Vizianagaram Machilipatnam Chittoor

పేదల కోసం ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు

- ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన పెంచాలని సూచన
- ప్రతి పథకం లబ్ధి కుటుంబాలకు చేరేలా చర్యలు
- మహిళలపై నేరాలకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరిక

ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులకు కూటమి ప్రభుత్వం సిద్ధం

పేద, మధ్యతరగతి కుటుంబాలకు పూర్తి సంక్షేమ లక్ష్యం

ప్రతి పథకం లబ్ధి కుటుంబాలకు చేరేలా చర్యలు

అన్న క్యాంటీన్లపై రోజువారీ పర్యవేక్షణకు ఆదేశాలు

పేదలకు తక్కువ ఖర్చుతో మూడు పూటల భోజనం

మహిళలపై నేరాలకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరిక

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం పేదలు మధ్యతరగతి వర్గాల సంక్షేమం కోసం మరో అడుగు ముందుకు వేసింది. వారికి క్రమం తప్పకుండా అన్ని సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో కొత్త విధానం దిశగా సాగుతోంది. అందులో భాగమే ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు విధానంగా ఉంది. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా కూటమి ప్రభుత్వం అందించే ప్రతీ పథకం ఆ కుటుంబంలో లబ్దిదారులకు అందుతుందా లేదా అన్నది ప్రభుత్వానికి తెలుస్తుందని అలాగే ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు ద్వారా ఆ కుటుంబం కూడా పూర్తి అవగాహన ఉంటుందని భావిస్తున్నారు.

మిగతా 2 లో

మిగతా 2 లో

టీడీపీ మహానాడుకు ధీటుగా వైసీపీ భారీ ప్లాన్ ?

రెండేళ్లైనా వైసీపీ గ్రౌండ్‌లో కనిపించని పరిస్థితి

- జగన్ వెయిట్ అండ్ సీ ధోరణిపై పార్టీలో చర్చ
- క్యాడర్ సమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు
- కూటమి ప్రభుత్వం ఇంకా పూర్తి జోష్‌లోనే కొనసాగింపు
- మహానాడుతో టీడీపీ శ్రేణుల్లో పెరిగిన ఉత్సాహం
- స్థానిక ఎన్నికలకు టీడీపీ ఫుల్ ప్రిపరేషన్‌లోకి ఎంట్రీ
- ప్లీనరీ తరహా భారీ సభకు వైసీపీ సిద్ధమవుతోందన్న ప్రచారం

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఏపీ రాజకీయ తెర పైన వైసీపీ సందడి తగ్గిపోతోంది. ఆ పార్టీ విపక్షంలోకి వచ్చి రెండేళ్ళు అవుతోంది. అధినేత జగన్ వెయిట్ అండ్ సీ అన్నట్లుగా ఉన్నారు అధినేత జనంలోకి వెళ్ళకపోవడంతో నాయకులు కూడా అదే విధంగా ఉన్నారని

ఏపీ ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపు

ఆర్థిక వ్యవస్థ పటిష్టతే లక్ష్యం
సామర్థ్యం పెంపుపై సీఎం చంద్రబాబు దృష్టి
పటిష్ట ఆర్థిక వ్యవస్థకు సామర్థ్యం పెంపే మార్గం
రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రతీ నెలా గణాంకాల సేకరణ
రాష్ట్రం నుంచి మండల స్థాయి వరకు ఉద్యోగులకు శిక్షణ
ఆర్థిక విశ్లేషణకు ఏఐ టెక్నాలజీ వినియోగం
15 శాతం వృద్ధి సాధించి స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధన

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 15 శాతం వృద్ధిరేటును స్థిరంగా సాధించడం ద్వారానే స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని చేరుకోగలమని, దీనికోసం క్షేత్రస్థాయి నుంచి పక్కాగా, వేగంగా గణాంకాలు సేకరించాలని సూచించారు. బుధవారం నాడు సచివాలయంలో ప్రణాళిక శాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే పూర్తిస్థాయి 'డేటా డ్రివెన్ గవర్నెన్స్'కు శ్రీకారం చుడతామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం త్రైమాసిక, వార్షిక ప్రాతిపదికన రాష్ట్ర

మిగతా 2 లో...

ఆయన్ను చూసి నేర్చుకోండి

- ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించిన నార్వే ప్రముఖ వార్తాపత్రిక
- ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ ఉన్న నేతగా మోదీని అభివర్ణన
- మోదీని చూసి నార్డిక్ దేశాల ప్రధానులు నేర్చుకోవాలని సూచన
- భారత్ ఆర్థిక, హరిత వృద్ధి విధానాలను కొనియాడిన కథనం
- మోదీకి 70 శాతం ప్రజామోదం ఉందని, యూరప్ నేతలకు ఇది జరగని పని అని వ్యాఖ్య

జాతీయం, ఉష శ్రీ

భారత ప్రధాని నరేంద్ర మోదీపై నార్వేకు చెందిన ప్రముఖ ఆర్థిక దినపత్రిక 'డాగెన్స్ నారింగ్స్‌లివ్' (డీఎన్) ప్రశంసల వర్షం కురిపించింది. మోదీని "ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన రాజకీయ నాయకుడు" అని అభివర్ణించిన ఆ పత్రిక, నార్డిక్ దేశాల ప్రధానులు ఆయన నుంచి ఎంతో నేర్చుకోవాలని సూచిస్తూ ఒక ప్రత్యేక

కట్టడికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్

ఏపీలో సైబర్, ఆర్థిక నేరాలపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష
రాష్ట్రవ్యాప్తంగా బాధితులు రూ. 652 కోట్లు నష్టపోయారని వెల్లడి
రూ. 116 కోట్లను కాపాడగలిగిన సీఐడీ, బ్యాంకింగ్ వ్యవస్థ
సైబర్ నేరాల కట్టడికి పటిష్టమైన ప్లాన్ రూపొందించాలని ఆదేశం
విజయవాడ, విశాఖ, తిరుపతిలలో ఇప్పటికే సైబర్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

రాష్ట్రంలో పెరిగిపోతున్న సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ నేరాల కట్టడికి పటిష్ఠమైన యాక్షన్ ప్లాన్ రూపొందించడమే లక్ష్యంగా సచివాలయంలో బుధవారం ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సైబర్ నేరాల తీవ్రత, వాటిని అరికట్టేందుకు

మేడ్ ఫర్ ఇండియా

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనలో ఎంఎస్ఎంఈలదే కీలక పాత్ర
రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాలకు ఒప్పందాలు
వచ్చే మూడు నెలల్లో 100 ఏపీ కంపెనీలు ఎన్ఎస్ఈలో లిస్ట్ కావాలని లక్ష్యం
'ఒకే రాజధాని-అభివృద్ధి వికేంద్రీకరణ' నినాదంతో 22 క్లస్టర్ల ఏర్పాటు
'మేడ్ ఇన్ ఆంధ్ర - మేడ్ ఫర్ ఇండియా - మేడ్ ఫర్ ది వరల్డ్' ప్రభుత్వ ధ్యేయం

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ బృహత్కార్యంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పాత్ర అత్యంత కీలకమని ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. "మేడ్ ఇన్ ఆంధ్ర – మేడ్ ఫర్ ఇండియా – మేడ్ ఫర్ ది వరల్డ్" అనే నినాదాన్ని సాకారం చేసే దిశగా ప్రభుత్వం

ఏపీ ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపు

స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) అంచనాలు రూపొందిస్తున్నారని, దీనివల్ల వాస్తవ ఆర్థిక పరిస్థితిపై తక్షణ అవగాహన కలగడం లేదని సీఎం అభిప్రాయపడ్డారు. చారిత్రక డేటాపై ఆధారపడటం వల్ల విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఈ విధానాన్ని మార్చి, ప్రతీ నెలా రాష్ట్ర ఆర్థిక వృద్ధిని జిల్లా, మండల స్థాయిలో ట్రాక్ చేసేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఇందుకోసం జీఎస్‌డీపీ విధానాన్ని అర్థం చేసుకునేలా, రియల్‌టైమ్ పద్ధతిలో అంచనాలు రూపొందించేలా అధికారులకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు సిబ్బందికి మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని 5 జోన్లు, 28 జిల్లాలు, 175 నియోజకవర్గాలను కవర్ చేస్తూ ఈ శిక్షణ ఉండాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు అధికారులను మాస్టర్ ట్రైనర్లుగా తీర్చిదిద్దాలని సూచించారు. మరోవైపు, వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం పర్యవేక్షణలో లేని ఆర్థిక సూచికలను కూడా గుర్తించి, వాటిని కూడా ట్రాక్ చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సమీక్షలో జీఎస్‌డీపీ సామర్థ్య పెంపు, రాబోయే సర్వేలు, కేపీఐల ఆడిటింగ్ వంటి పలు కీలక అంశాలపై చర్చించారు.

ఆయన్ను చూసి నేర్చుకోండి

కథనాన్ని ప్రచురించింది. మే 18న ప్రధాని మోదీ నార్వే పర్యటనకు రానున్న నేపథ్యంలో ఈ కథనం వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. నార్డిక్ దేశాల ప్రధానులకు కనీసం 30 శాతం ప్రజామోదం కూడా దక్కడం లేదని, కానీ మోదీకి సుమారు 70 శాతం ప్రజామోదం ఉందని ఆ కథనం పేర్కొంది. "ఏ పెద్ద దేశంలోనూ ఏ నాయకుడికీ స్వదేశంలో మోదీ అంతటి జనాదరణ లేదు. ఆయన మళ్లీ పోటీ చేస్తే కచ్చితంగా గెలుస్తారు. ఇది యూరప్ నేతలకు అందని కల" అని వ్యాఖ్యానించింది. మోదీ విజయం వెనుక వేగవంతమైన ఆర్థికాభివృద్ధి, బలమైన భావజాలం, ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన రాజకీయ పార్టీ, ఆయన స్ఫూర్తిదాయక జీవిత ప్రస్థానం ఉన్నాయని విశ్లేషించింది. సాధారణ కుటుంబం నుంచి వచ్చి, ఉన్నతస్థాయికి ఎదిగిన మోదీ ప్రస్థానం అరుదైనదని, ఈ విషయంలో ఆయనను నార్వే మాజీ ప్రధాని ఐనార్ గెర్హార్డ్‌సెన్‌తో పోల్చింది. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ 7 శాతం వృద్ధితో చైనాను మించి దూసుకెళ్తోందని, 2050 నాటికి ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా వేసింది. పర్యావరణ హిత వృద్ధిలోనూ భారత్ ముందుందని, సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉందని గుర్తుచేసింది. బీజేపీ పాలనలో మత ఘర్షణలు పెరిగాయన్న విమర్శలను కూడా ఈ కథనం తోసిపుచ్చింది. కాంగ్రెస్ హయాంలోనే ఎక్కువ హింసాత్మక ఘటనలు జరిగాయని, పొరుగు దేశాల నుంచి లక్షలాది మంది ముస్లింలు భారత్‌కు వలస వస్తున్నారని, కానీ భారత్ నుంచి వెళ్లడం లేదని పేర్కొంది. నియమాల ఆధారిత ప్రపంచం కోసం నార్వేకు భారత్ వంటి మిత్రదేశాలు అవసరమని, భారత్‌కు నీతులు చెప్పడం మాని, ఆ దేశం నుంచి నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఆ పత్రిక తన కథనాన్ని ముగించింది.

కట్టడికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్

తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు రాష్ట్రంలోని సైబర్ నేరాల పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో సైబర్, ఆర్థిక నేరాలకు సంబంధించి '1930' టోల్ ఫ్రీ నెంబర్‌కు బాధితుల నుంచి ఏకంగా 9.29 లక్షల ఫిర్యాదులు అందాయని, ఇది సమస్య తీవ్రతకు అద్దం పడుతోందని తెలిపారు. ఇప్పటివరకు బాధితులు సుమారు రూ.652 కోట్ల మేర నగదును కోల్పోయారని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాలే (ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్) అతిపెద్ద ఆర్థిక నేరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటితో పాటు ఫిషింగ్, విషింగ్, క్రెడిట్/డెబిట్ కార్డు మోసాలు, ఆన్‌లైన్ లోన్ ఫ్రాడ్స్, 'డిజిటల్ అరెస్ట్' వంటి కొత్త తరహా మోసాలతో ప్రజలు నిలువునా దోపిడీకి గురవుతున్నారని వివరించారు. అయితే, సీఐడీ సైబర్ క్రైమ్ విభాగం, బ్యాంకర్లతో కలిసి సమర్థవంతంగా పనిచేస్తూ రూ.116 కోట్లకు పైగా మొత్తాన్ని నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లకుండా నిలువరించగలిగామని అధికారులు చెప్పడం కొంత ఊరటనిచ్చింది. 'గోల్డెన్ అవర్'లో తక్షణమే స్పందించడం ద్వారా ఇది సాధ్యమైందని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటే పోలీస్ యంత్రాంగం, బ్యాంకర్ల మధ్య మరింత దృఢమైన సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. ఇతరుల బ్యాంకు ఖాతాలను నేరగాళ్లు దుర్వినియోగం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఒక సమగ్ర 'ఏపీ సైబర్ పాలసీ'ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర స్థాయిలో సీఐడీ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ పనిచేస్తోందని అధికారులు తెలిపారు. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలలో ప్రత్యేక సైబర్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమీక్షలో హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఏపీ ఫోరెన్సిక్స్ సలహాదారు కేపీసీ గాంధీ, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు పాలుపంచుకుని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

వైసీపీ భారీ ప్లాన్

అంటున్నారు. ఇక గతంలో వైసీపీ అధికారంలో ఉన్నపుడు కోటి గొంతుకలు వినిపించేవి ఎన్నో పదవులు సృష్టించి మరీ వైసీపీ ప్రభుత్వంలో పంచి పెట్టారు. పంచాయతీ వార్డు నుంచి పార్లమెంట్ మెంబర్ దాకా వైసీపీ వారే ఉన్నారు. నామినేటెడ్ పదవులు వీటికి అదనం. ఇలా లెక్కలేనన్ని పదవులు తీసుకున్న వారు అంతా వైసీపీ ఓటమితో సైడ్ అయిపోయారు. ఈ రోజున వైసీపీ తరఫున కేవలం కొన్ని గొంతులు మాత్రమే వినిపిస్తున్నాయి. అవి కూడా మీడియా ముందు మాత్రమే సౌండ్ చేస్తున్నాయి. గ్రౌండ్ లెవెల్ లోకి వైసీపీ వెళ్లడం లేదు, మరో వైపు క్యాడర్ ఊసు ఎవరికీ పట్టడం లేదు, పార్టీ అధికారంలో ఉన్నపుడు విపక్షంలో ఉన్నపుడు కూడా క్యాడర్ గోడు పట్టని తీరుతోనే వైసీపీ నిర్లిప్తంగా ఉండిపోతోంది.

రెట్టించిన హుషార్ తోనే : ఇక సాధారణంగా చూస్తే ఎన్నికలు జరిగి అధికారంలోకి వచ్చిన పార్టీకి తొలి ఆరు నెలలే హానీ మూన్ గా ఉంటుంది. ఆ తరువాత అంతా గతుకుల బండి మీద ప్రయాణంగానే సాగుతుంది. ప్రతిపక్షాలు జనంలోకి వచ్చి ఆందోళన చేస్తాయి. అలాగే ప్రజలలో అసంతృప్తి కూడా పెద్ద ఎత్తున ఉంటుంది. దాంతో పాటుగా పార్టీలో సైతం నాయకులు క్యాడర్ మధ్యన అంతరం అధికారంలో ఉన్న వారి ఆశలు తీరక అలకలు అపోహలు అలజడులు ఇలా సవాలక్ష సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉంటాయి. కానీ అదేమి చిత్రంలో కూటమికి మాత్రం చాలా విషయాలు కలిసి వస్తున్నాయి. రెండేళ్ళు అవుతున్నా ఇంకా మోజు మీదనే ప్రభుత్వం ఉంది. టీడీపీ తమ నాయకులతో క్యాడర్ తో కో ఆర్డినేషన్ చేసుకుంటోంది. మిత్రుల మధ్య కూడా అగ్ర స్థాయిలో విభేదాలు అయితే లేవు. ఇక విపక్షం వైసీపీ అయితే పూర్తిగా హానీమూన్ చేసుకోమని పొలిటికల్ గ్రౌండ్ అంతా వదిలేసింది. దాంతో కూటమికి ఎదురే లేదన్న వాతావరణం అయితే కనిపిస్తోంది. చర్చ అంతా కూటమి వైపు నుంచే సాగుతోంది. అసెంబ్లీలో ఎటూ విపక్షం లేదు బయట కూడా లేదన్న పరిస్థితి ఏర్పడడానికి కారణం వైసీపీ అధినాయకత్వం ఉదాశీన వైఖరులే కారణం అని అంటున్నారు.

పార్టీ పండుగతో దూకుడు : టీడీపీ క్రమం తప్పకుండా ప్రతీ ఏటా మహానాడుని పెద్ద ఎత్తున నిర్వహిస్తూ ఉంటుంది. ఇది పార్టీ క్యాడర్ కి ఎక్కడ లేని హుషార్ ని తెస్తుంది. అలాంటి సందడి సరదా మరే పార్టీలో కనిపించవు. ఈసారి నెల్లూరులో టీడీపీ మహానాడు జరుపుతోంది. దానికి భారీ స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మధ్యనే టీడీపీ జాతీయ రాష్ట్ర స్థాయి కమిటీలని కూడా వేసింది. దాంతో పదవులు అందుకున్న వారంత మరింత జోష్ తో ఉన్నారు. ఈ క్రమంలో టీడీపీ రీ చార్జి అవుతూ స్థానిక ఎన్నికలకు ఫుల్ ప్రిపేర్డ్ గా ఉంది. మరో వైపు చూస్తే వైసీపీ శిబిరం డీలాగా ఉందని అంటున్నారు.

భారీ సభకు తయారు : ఈ పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తున్న వైసీపీ అధినాయకత్వం తమ పార్టీ క్యాడర్ లో కూడా హుషార్ తీసుకుని రావాలని చూస్తోంది అని అంటున్నారు. ఎపుడో 2022 లో వైసీపీ అధికారంలో ఉన్నపుడు గుంటూరు వేదికగా ప్లీనరీని వైసీపీ నిర్వహించింది. ఆ తరువాత చూస్తే నాలుగేళ్లుగా పార్టీ పండుగ అంటూ ఏదీ లేదని అంటున్నారు. దాంతో పార్టీ జనాలకు ఉత్సహం పెంచి గ్రౌండ్ లోకి పూర్తి స్థాయిలో దించడానికి వైసీపీ కూడా మహానాడు తరహాలో రాష్ట్ర స్థాయి పార్టీ సమావేశాలను నిర్వహించాలని చూస్తోంది అని ప్రచారం సాగుతోంది. అది కూడా సాధ్యమైంత తొందరగానే చేయాలని ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. పార్టీ బూత్ లెవెల్ కమిటీలు తొందరలో పూర్తి అవుతాయని చెబుతున్న నేపథ్యంలో అవి పూర్తి కాగానే వైసీపీ కూడా ప్లీనరీ లాంటి భారీ సభలతో ఫుల్ యాక్టివ్ మోడ్ లోకి వస్తుందని అంటున్నారు.

పేదల కోసం ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు

ప్రతీ కుటుంబానికి సంక్షేమం : రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతీ పేద మధ్యతరగతి కుటుంబానికి సంక్షేమం అందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం అన్నది రెండు కళ్ళుగా చెప్పారు. వాటిని బ్యాలెన్స్ చేస్తూ పాలన చేస్తున్నామని చెప్పారు అందుకే త్వరలో ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులను రూపొందిస్తున్నామని బాబు చెప్పారు. అదే విధంగా ఏపీలో ఉన్న అన్న క్యాంటీన్ల ద్వారా పేదలు మధ్యతరగతి తమ ఆకలి తీర్చుకుంటున్నారు అని బాబు అన్నారు.

పేదలకు డబ్బు ఆదా : అక్కడ పరిస్థితుల మీద కూడా అధికారులు ప్రతీ రోజూ తెలుసుకోవాలని బాబు కోరారు రోజూ తనిఖీలు చేస్తూనే ఉండాలని అన్నారు. అన్న క్యాంటీన్ల విషయంలో ఒక్క ఫిర్యాదు కూడా రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. పేదలు సంతృప్తిగా భోజనం చేసేలా ఏర్పాట్లు చేశామని బాబు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు డబ్బు ఆదా అవుతోందని బాబు చెప్పారు. వారికి మూడు పూటలా కడుపు నిండా ఆహారాన్ని అందిస్తున్నామని బాబు గుర్తు చేశారు.

తప్పు చేయాలంటే భయపడాలి : రాష్ట్రంలో మహిళలపై నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని బాబు పోలీసు అధికారులకు సూచించారు. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడేలా చూడాలని అన్నారు. తప్పు చేయాలంటేనే వారు వణికిపోయే పరిస్థితి రావాలని అన్నారు. ఆ పరిస్థితి వచ్చేలా పోలీసింగ్ ఉండాల్సిన అవసరం ఉందని బాబు అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో తగిన ఫోకస్ ఉండాలని ఏపీలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా ఉండాలని కోరారు.

ఉద్యాన పంటల వల్ల లాభాలు : ఇక రాష్ట్రంలోని రైతాంగానికి ఉద్యాన వన పంటల విషయంలో అవగాహన్ ఆసక్తి ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఉద్యాన పంటల వైపు రైతులను మళ్లించడంతో పాటు ఉద్యాన పంటల వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించాలని అన్నారు. అదే విధంగా రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో ఏయే పంటలు వేసుకోవాలనే అంశం మీద అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని బాబు కోరారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంభించేలా రైతులలో మరింత అవగాహన కల్పించాలని అన్నారు. వ్యవసాయంలో రీసెర్చ్ వర్క్ మరింత పెంచాలని కూడా ఆయన దిశా నిర్దేశం చేశారు.

మేడ్ ఫర్ ఇండియా

అడుగులు వేస్తోందని ఆయన తెలిపారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (చీఫ్), ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీఐఐ సంయుక్తంగా విజయవాడలో నిర్వహించిన ఎస్ఎంఈ ఐపీఓపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

యువగళం యాత్రే స్ఫూర్తి : తన యువగళం పాదయాత్రే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యానికి స్ఫూర్తినిచ్చిందని లోకేష్ వివరించారు. "3132 కిలోమీటర్ల పాదయాత్రలో ఎందరో ప్రజల కష్టసుఖాలు చూశాను. పెనుగొండలో కియా అనుబంధ సంస్థలో పనిచేస్తున్న పద్మావతి అనే సోదరి తన అనుభవాన్ని పంచుకుంది. కియా రాకముందు గృహిణిగా ఉన్న ఆమె, పరిశ్రమ వచ్చాక ఉద్యోగంలో చేరి నెలకు రూ.30 వేలు సంపాదిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. ఆమె కథ విన్నాక ఉద్యోగ కల్పన ప్రాధాన్యం నాకు మరింత అర్థమైంది. ఆ ఆలోచన నుంచే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం పుట్టింది" అని లోకేష్ పేర్కొన్నారు.

పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్: గడిచిన 23 నెలల్లో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని మంత్రి తెలిపారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. ఇప్పటివరకు 800 ప్రాజెక్టుల ద్వారా రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు కుదిరాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు రూ.1.35 లక్షల కోట్ల చొప్పున పెట్టుబడులతో ముందుకొచ్చాయి. వాటికి శంకుస్థాపనలు కూడా జరిగాయి. రాయల్ ఎన్ఫీల్డ్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలతో పాటు పుట్టపర్తిలో ఫైటర్ జెట్ తయారీ కేంద్రం 'ఊవీజూ' ప్రాజెక్టు కూడా రాష్ట్రానికి రాబోతోంది" అని వెల్లడించారు. ఒక పెద్ద పెట్టుబడి వస్తే దాని చుట్టూ అనేక అనుబంధ పరిశ్రమలు ఎలా వస్తాయో వివరిస్తూ 'మల్టిప్లయర్ ఎఫెక్ట్' గురించి లోకేష్ మాట్లాడారు. "విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కారణంగా, దానికి అవసరమైన కూలింగ్ సిస్టమ్స్ సరఫరా కోసం క్యారియర్ కంపెనీ శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఇదే మల్టిప్లయర్ ఎఫెక్ట్," అని ఆయన వివరించారు.

అభివృద్ధి వికేంద్రీకరణే ప్రభుత్వ లక్ష్యం: 'ఒకే రాజధాని -- అభివృద్ధి వికేంద్రీకరణ' అనేదే ప్రభుత్వ విధానమని లోకేష్ స్పష్టం చేశారు. "రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో ఉన్నాం. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. రాయలసీమలో ఆటోమొబైల్, కోస్తాలో ఆక్వా, ఉత్తరాంధ్రలో ఫార్మా, డేటా సెంటర్లు వంటి రంగాలపై దృష్టి సారించాం. నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయబోతున్నాం," అని తెలిపారు.

ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వ అండ: "మాకు గూగుల్ ఎంత ముఖ్యమో, రూ.50 లక్షల పెట్టుబడితో మొదలయ్యే చిన్న పరిశ్రమ కూడా అంతే ముఖ్యం. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వైపు పయనిస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు ఏ కష్టం వచ్చినా తాను ఒక మెసేజ్ దూరంలో ఉంటానని" భరోసా ఇచ్చారు. రాబోయే మూడు నెలల్లో కనీసం 100 ఎంఎస్ఎంఈ కంపెనీలు ఎన్ఎస్ఈలో లిస్ట్ అయ్యేలా ఎంఎస్ఎంఈ శాఖ కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు లోకేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయులు, కేశినేని శివనాథ్, ఎన్ఎస్ఈ సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ ద్వారా కనక దుర్గమ్మ ఆలయ సేవల బుకింగ్స్

ఇంద్రకీలాద్రి, ఉషశ్రీ మే 13: విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం "మన మిత్ర -- వాట్సప్ గవర్నెన్స్" సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై దర్శనం, సేవలు, ఈ-హుండీ తదితర ఆలయ బుకింగ్స్‌ను వాట్సప్ ద్వారానే సులభంగా పొందవచ్చని ఆలయ ఈఓ తెలిపారు. భక్తులు 9552300009 నెంబర్‌కు వాట్సప్‌లో "ఎఐ" మెసేజ్ పంపడం ద్వారా సేవలను వినియోగించుకోవచ్చు. అలాగే క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కూడా సేవలను ప్రారంభించవచ్చు. వాట్సప్‌లో "సేవను ఎంచుకోండి" ఎంపికపై క్లిక్ చేసి "దేవాలయ బుకింగ్ సేవలు"ను ఎంచుకోవాలి. అనంతరం ఆలయం ఉన్న జిల్లా పేరుగా "ఎన్టీఆర్ "ను, ఆలయంగా "శ్రీ దుర్గమల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం "ను ఎంపిక చేసుకోవాలి. తరువాత దర్శనం, సేవ లేదా ఈ-హుండీ ఆప్షన్లలో కావలసిన సేవను ఎంచుకుని తేదీ, స్లాట్ ఎంపిక చేయాలి. భక్తుల పేరు, ఆధార్ తదితర వివరాలు నమోదు చేసిన తరువాత "రివ్యూ అండ్ పే /పే నౌ " ద్వారా చెల్లింపులు పూర్తి చేసి టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. డౌన్‌లోడ్ చేసిన టికెట్‌ను దేవస్థానంలో చూపించి ప్రింట్ తీసుకుని సంబంధిత సేవలను పొందవచ్చని అధికారులు సూచించారు.

ఆకివీడు మదన గోపాలస్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ఆకివీడు: (ఉషశ్రీ) మే 13: పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మదన గోపాలస్వామి ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. చైర్మన్ గా జమ్మిని పెద్దిరాజు మరియు పలువురు డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మరియు పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తుగా నాగరాజు మరియు మోటుపల్లి రామ వరప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలని పాలకవర్గ సభ్యులను నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గంధం ఉమా, గొంట్ల గణపతి, కిమిడి నాగరాజు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉండిలో మిన్నంటిన హనుమాన్ జయంతి వేడుకలు: 120 అడుగుల భారీ బ్యానర్ ప్రత్యేక ఆకర్షణ..

ఉండి, మే 13:(ఉషశ్రీ): మండల కేంద్రమైన ఉండి గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బ్యానర్ భక్తులను, స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఉండి హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకులు,?ఉండి మండల బజరంగ్దళ్ కన్వీనర్ కడగల యువ సాయిరాం ఆధ్వర్యంలో ఈ వేడుకల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 120 అడుగుల బ్యానర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. హనుమాన్ జయంతి వేడుకల్లో బాణసంచా కాలుస్తూ యువత జైశ్రీరామ్ నినాదాలతో ఉండి గ్రామం మారుమోగింది.? జయంతి వేడుకల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బజరంగ్దళ్ కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.?ఈ సందర్భంగా కడగల యువ సాయిరాం మాట్లాడుతూ, హనుమంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రతి ఏటా ఇలాగే ఐక్యమత్యంతో వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ భారీ బ్యానర్ వద్ద యువత ఉత్సాహంగా ఫోటోలు దిగుతూ సందడి చేశారు. ఈ హనుమాన్ జయంతి వేడుకల్లో కిలారి అప్పారావు,సతీష్,కిలారీ చిన్నారావు,వెంకటేష్, వంశీ నారాయణ కాలేజీ ప్రిన్సిపాల్ కునుకుపవన్, దినేష్,యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

ట్రాఫిక్ పోలీసులకు కూల్ జాకెట్లు పంపిణీ

విజయవాడ కమిషనరేట్ (ఉషశ్రీ)మే 13: విజయవాడలో తీవ్ర ఎండల్లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి ఉపశమనం కలిగించేందుకు ఎస్ . వీ . రాజశేఖర్ బాబు చేతుల మీదుగా కూల్ జాకెట్లు, కూల్ క్యాప్స్ పంపిణీ చేశారు. రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 10,873 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిలో 97 శాతం పనిచేస్తున్నాయని చెప్పారు. "అస్త్రం" యాప్, "ఈ-పాత్" వ్యవస్థలతో ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతో పాటు అంబులెన్స్‌లకు గ్రీన్ ఛానల్ సదుపాయం కల్పిస్తున్నామని వెల్లడించారు.

పుల్లేటికట్ట డ్రైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి : కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ, (ఉషశ్రీ)మే 13 : పుల్లేటికట్ట డ్రైన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం బెత్లెహేమ్ నగర్, జియాన్ బైబిల్ రోడ్, ణతీ. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సస్ , గుణదల, ఈఎస్ఐ హాస్పిటల్ ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. జియాన్ బైబిల్ స్కూల్ పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన ఆయన, డివైడర్ల వద్ద చెత్త లేకుండా పరిశుభ్రతను కాపాడాలని అన్నారు. తదుపరి ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించి వ్యర్థాల తొలగింపుపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వద్ద ఉన్న పబ్లిక్ టాయిలెట్లను పరిశీలించిన కమిషనర్, నగరంలోని అన్ని మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు ఊరట.. రొయ్యల ఫీడ్ ధరల పెంపు నిలిపివేత

కింజరపు అచ్చెన్నాయుడు నాయుడు

అమరావతి ఉషశ్రీ మే 13: జోక్యంతో రొయ్యల ఫీడ్ ధరల పెంపును తాత్కాలికంగా నిలిపివేస్తూ ష్రిమ్ప్ ఫీడ్ తయారీ సంస్థలు కీలక నిర్ణయం తీసుకున్నాయని, ఆక్వా రైతులపై అదనపు భారం మోపే ఏకపక్ష నిర్ణయాలను ప్రభుత్వం సహించబోదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అమరావతి వేదికగా బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు, రైతు సంఘాలు, అధికారులతో చర్చించారు. ప్రస్తుతం ఆక్వా రంగం పలు సవాళ్లు ఎదుర్కొంటున్న సమయంలో ఫీడ్ ధరలను ఒక్కసారిగా పెంచడం వల్ల వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా ధరలు పెంచడం సమంజసం కాదని, రైతుల కష్టాలపై వ్యాపారం చేయొద్దని ఫీడ్ కంపెనీలకు మంత్రి గట్టి హెచ్చరిక జారీ చేశారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ధరల పెంపు అమలు తాత్కాలిక నిలిపివేత: మంత్రి సూచనల నేపథ్యంలో ష్రిమ్ప్ ఫీడ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రభుత్వం కు లిఖితపూర్వకంగా సమాచారం అందిస్తూ, పెంచిన ఫీడ్ ధరల అమలును తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ముడి పదార్థాల ధరలు పెరగడంతో ధరల సవరణపై ఆలోచించాల్సి వచ్చిందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వం సూచనలు, రైతుల ఆందోళనలను గౌరవిస్తూ ధరల పెంపును వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.

15న ఉమ్మడి సమావేశం: ఈ నెల 15న రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, అధికారులు పాల్గొనే ఉమ్మడి సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.

అందరి అభిప్రాయాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని రైతులకు నష్టం కలగకుండా, పరిశ్రమ కొనసాగగలిగేలా పరస్పర ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

జర్నలిస్టుల ప్రతిభకు ప్రభుత్వం గుర్తింపు..

2025-26 అవార్డుల ప్రక్రియ ప్రారంభం

విజయవాడ, (ఉషశ్రీ)మే 13: జర్నలిజం రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మీడియా ప్రతినిధులకు 2025-26 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆలపాటి సురేష్ కుమార్ వెల్లడించారు. స్థానిక సి.ఆర్. మీడియా అకాడమీ కార్యాలయంలో సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కే . ఎస్. విశ్వనాతన తో కలిసి బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. అవార్డుల ఎంపిక, ప్రదానం కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించిందని తెలిపారు. ఈ కమిటీకి ఆలపాటి సురేశ్ కుమార్ చైర్మన్‌గా వ్యవహరించగా, సభ్యులుగా ఏ . ఏ . వీ . ప్రసాద్ , డీ . వీ . ఆర్. మూర్తి , రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణ మూర్తి ఉంటారని పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం మొత్తం 12 అవార్డులను అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో కొన్ని అవార్డులను కమిటీ విచక్షణాధికారంతో ఎంపిక చేయగా, మరికొన్నింటికి దరఖాస్తులు స్వీకరించి అర్హులను ఎంపిక చేస్తామని చెప్పారు. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు రూ.3 లక్షలు, ఉత్తమ జర్నలిస్టు మరియు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డులకు రూ.2 లక్షలు చొప్పున, మిగిలిన అవార్డులకు రూ.1 లక్ష చొప్పున నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే అర్హతలు, దరఖాస్తుల చివరి తేదీలతో కూడిన అధికారిక ప్రకటన విడుదల చేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టుల అవార్డులకు కనీస అనుభవాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని, అక్రిడిటేషన్‌తో సంబంధం లేదని ఆలపాటి సురేశ్ కుమార్ స్పష్టం చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ మాట్లాడుతూ, 2017 తరువాత మళ్లీ జర్నలిస్టుల అవార్డుల సంప్రదాయాన్ని ప్రభుత్వం పునరుద్ధరిస్తోందన్నారు. ప్రతి ఏడాది అవార్డులు అందజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఒక వారం రోజుల్లో అవార్డులకు సంబంధించిన ప్రకటన విడుదల చేసి, జులై నెలలో అవార్డుల ప్రదానం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రటరీ వీ . మణిరం, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ ఐ .సూర్య చంద్ర రావు , డిప్యూటీ డైరెక్టర్ డీ . రమేష్ , సి.ఆర్. మీడియా అకాడమీ మేనేజర్ ఎం . భాస్కర నారాయణ, విజయవాడ రాష్ట్ర సమాచార కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ జా. వీ . మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిని మెడికల్, స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం : సీఎం చంద్రబాబు

అమరావతి,(ఉషశ్రీ)మే 13: అమరావతిని దేశంలోనే అత్యాధునిక వైద్య, విద్య, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. నిడమర్రులో ఏర్పాటు కానున్న బొల్లినేని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ మరియు మెడికల్ కాలేజీకి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ , ఎంపీ గంటి హరీష్ , మంత్రి పయ్యావుల కేశవ్ తదితరులు పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ చిన్న స్థాయిలో ప్రారంభమైన కిమ్స్ హాస్పిటల్స్ ఇప్పుడు 30 వేల కోట్ల ఆస్తులతో విస్తరించిందని చెప్పారు. పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తేనే రాష్ట్రానికి సంపద సృష్టి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గతంలో హైదరాబాద్‌లో కొద్ది ఆస్పత్రులు, హోటళ్లు మాత్రమే ఉండేవని, ఇప్పుడు దేశానికే మెడికల్ హబ్‌గా మారడానికి కిమ్స్ వంటి సంస్థలే కారణమన్నారు. అమరావతిలో 23 ఎకరాల్లో మెడికల్ కాలేజీ, మరో 2 ఎకరాల్లో స్కిల్ యూని వర్సిటీ ఏర్పాటు అవుతోందని తెలిపారు. 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, 250 మెడికల్ సీట్లు, 1000 నాన్ మెడికల్ సీట్లు, వేలాది మందికి శిక్షణ అందించేలా ఈ సంస్థ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి భారీ డిమాండ్ ఉందని, యువత ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. వైద్య రంగంలో కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవసరం పెరుగుతోందని, డాక్టర్లు కూడా ఏఐ నేర్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రపంచంలో ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడ సేవలు అందించేందుకు విదేశీ భాషలను కూడా నేర్చుకోవాలని యువతకు విలువనిచ్చారు. అమరావతిని క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా కూడా తీర్చిదిద్దుతున్నామని సీఎం వెల్లడించారు. ఇప్పటికే క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ ఏర్పాటైందని, త్వరలో 133 క్యూబిట్ సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానుందని చెప్పారు. డిసెంబర్ నాటికి దేశంలో తొలి క్వాంటం కంప్యూటర్‌కు అమరావతి చిరునామాగా మారుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. రైతులకు పంపుసెట్ల వద్ద సోలార్ సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో విద్యుత్ రంగంపై భారీ భారం పడిందని, ప్రస్తుతం విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గిస్తూ ప్రజలపై అదనపు ఛార్జీలు మోపకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో అమరావతితో పాటు విశాఖపట్నాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దుతున్నామని, రాయలసీమలో ఫైటర్ జెట్



పరిశ్రమ, కర్నూలులో డ్రోన్ సిటీ, శ్రీసిటీలో ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. కర్నూలులో బంగారం ఉత్పత్తి ప్రాజెక్టు ప్రారంభం కానుందని, దేశంలో ఉత్పత్తి అయ్యే బంగారంలో 50 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే వచ్చే అవకాశం ఉందన్నారు. పర్యాటక రంగంపై కూడా సీఎం ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, విదేశాలకు వెళ్లే బదులు అరకు, పాపికొండలు, గండికోట, సూర్యలంక వంటి ప్రాంతాలను అభివృద్ధి చేసి అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చిన సీఎం, శంకుస్థాపనలతో పాటు ప్రాజెక్టులు త్వరగా పూర్తై కార్యకలాపాలు ప్రారంభం కావాలని కోరారు.

యుద్ధ పరిస్థితుల్లో దేశానికి ప్రజలు అండగా నిలవాలి : సీఎం చంద్రబాబు

అమరావతి, (ఉషశ్రీ) మే 13: పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోది ప్రకటించిన పొదుపు చర్యలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని, చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఒకటి రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. యుద్ధ పరిస్థితుల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతోందని సీఎం వ్యాఖ్యానించారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు పౌరులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. "నాదేశం -- నా బాధ్యత" అనే భావన ప్రతి ఒక్కరిలో రావాలని అన్నారు. ప్రధాని మోదీ సూచించిన ఎనిమిది అంశాలను పాటించడం ద్వారా దేశానికి మేలు జరుగుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా పెట్రోలు, డీజిల్ వినియోగాన్ని తగ్గించడం వల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని తెలిపారు. వర్క్ ఫ్రమ్ హోమ్ ఇప్పుడు వాస్తవమవుతోందని, భవిష్యత్తులో ఇంటి నుంచే ప్రపంచవ్యాప్తంగా పనిచేసే పరిస్థితులు మరింత పెరుగుతాయని సీఎం చెప్పారు. ప్రభుత్వ వ్యవస్థలో కూడా ఈ తరహా విధానాలను అమలు చేసే పరిస్థితులు వస్తాయని అభిప్రాయపడ్డారు. దేశంలో దుబారా ఖర్చులను తగ్గించాల్సిన అవసరం ఉందని పేర్కొన్న సీఎం, పెద్ద కాన్వాయ్‌లలో తిరగడం ఒక ఫ్యాషన్‌గా మారిందని వ్యాఖ్యానించారు. ప్రజాప్రతినిధులు కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించుకుని ఆదర్శంగా నిలవాలని, భద్రతా వ్యవస్థలను కూడా అవసరానికి అనుగుణంగా కుదించుకోవాలని సూచించారు. విదేశీ పర్యటనలను తగ్గించుకోవాలని ప్రధాని ఇచ్చిన సూచనలను కూడా పాటించాలని సీఎం కోరారు. దేశంలోనే అనేక అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, విదేశాలకు వెళ్లడం కంటే దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. బంగారం కొనుగోళ్లను కూడా తగ్గించాలని ప్రధాని సూచించారని, దీనిపై ప్రజలు ఆలోచించాలని చంద్రబాబు అన్నారు. రెండు రోజుల్లో దీనిపై పూర్తి స్థాయి చర్చ జరిపి రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ప్రకటిస్తామని తెలిపారు.

ఆక్వా రంగాన్ని కుప్పకూల్చుతున్న కూటమి ప్రభుత్వం

- ఆక్వా ఫీడ్ ధరల పెంపుపై మండిపడ్డ వైఎస్సార్ సిపి
- తక్షణమే ఫీడ్ ధరలు తగ్గించకపోతే ఆక్వా రైతులతో కలిపి ఉద్యమం చేస్తాం ..
- వైఎస్సార్ సిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు

భీమవరం : (ఉషు) మే 13: కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులను నిలువునా ముంచేస్తుందని, ఆక్వా రంగాన్ని కుప్పకూల్చుతుందని వైఎస్సార్ సిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు మండిపడ్డారు. భీమవరం జిల్లావైఎస్సార్ సిపి కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఆక్వా ఫీడ్ ధరల పెంపుపై వైఎస్సార్ సిపి తీవ్ర స్థాయిలో స్పందించి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఆక్వా ఫీడ్ ధరల పెంపు దారుణమని, ప్రభుత్వ పెద్దలు, ఫీడ్ కంపెనీలు కుమ్మక్కై ఆక్వా రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి నెలా ఫీడ్ కంపెనీల నుంచి ప్రభుత్వ పెద్దలకు ముడుపులు అందుతున్నా యని, అందుకే ధరల పెంపును అడ్డుకోలేదని విమర్శించారు. తక్షణమే ఫీడ్ ధరలు తగ్గించకపోతే ఆక్వా రైతులతో కలిపి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫీడ్ ధరలు ఏకపక్షంగా వ్యవహరిస్తుంద ని, ప్రతి నెలా టీడీపీ కేంద్ర కార్యాలయానికి ముడుపులు వెళ్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల ఆక్వా రంగం అత్యంత దయనీయ స్థితికి చేరుకుందని, తక్షణమే ధరలు తగ్గించాలని లేని పక్షంలో ఆక్వా రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆక్వా ఫీడ్ కంపెనీలు, అధికార పార్టీ నేతలు కుమ్మక్కై రైతును దోచుకుంటున్నారని, ఫీడ్ ధరలపై సుంకాలు తగ్గినప్పుడు టన్నుకు రూ 25 వేలు తగ్గించాల్సిన ప్రభుత్వం, కేవలం రూ 4 వేలు తగ్గించి చేతులు దులుపుకుందన్నారు. యూనిట్ విద్యుత్ కి రూ 1.50 సబ్సిడీ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, రెండేళ్లు కావస్తున్నా పైసా సబ్సిడీ ఇవ్వలేదన్నారు. వైఎస్ జగన్ హయాంలో 50,800 ఆక్వా కనెక్షన్లకు ఐదేళ్లలో రూ 3,640 కోట్లు సబ్సిడీగా ఇస్తే నేడు ఒక్క కొత్త కనెక్షన్ కూడా ఇవ్వకుండా 'సూపర్ సిక్స్' సూపర్ సక్సెస్ అంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ కావూరు శ్రీనివాస్, భీమవరం, ఇన్ ఛార్జ్ చినిమిల్లి వెంకట్రాయుడు, ఉండి ఇంచార్జ్ పివిఎల్ నరసింహరాజు, పార్లమెంట్ ఇన్ ఛార్జ్ గూడూరి ఉమాబాల, మేడిద జాన్సన్, ఏఎస్ రాజు పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని కార్మికులకు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలి

భీమవరం: (ఉషశ్రీ)మే 13: ఆంధ్రప్రదేశ్ విపత్తు నివారణ సంస్థ, 2026 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు మరియు వేడి తరంగాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో, కార్మికుల ఆరోగ్య రక్షణకు అవసరమైన జాగ్రత్త చర్యలను సంబంధిత యాజమాన్యాలు తప్పనిసరిగా చేపట్టాలని జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి ఆదేశించారు. ఈ మేరకు దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ఫ్యాక్టరీలు, భవన నిర్మాణాలు మరియు ఇతర నిర్మాణ కార్యకలాపాలలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు మరియు వారి యాజమాన్యాలు పాటించవలసిన సూచనలు తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కార్మికుల పని గంటలను తగిన విధంగా పునః షెడ్యూల్ చేయాలని సూచించారు. ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని కార్మికుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సహాయాన్ని అందించవలెనని తెలిపారు. అదేవిధంగా ూ=ూ ప్యాకెట్లు, ద్రవాలు, అత్యవసర ఐస్ ప్యాక్లు, ప్రథమ చికిత్స సామగ్రి, హీట్ ఇల్నెస్ నివారణకు అవసరమైన వస్తువులు, తగిన విశ్రాంతి కేంద్రాలు మరియు అంబులెన్స్ సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. వేడి తరంగాల తీవ్రత అధికంగా ఉండే మధ్యాహ్నం 12.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు బహిరంగ పనులను తగ్గించుట లేదా పనివేళలను మార్పు చేయుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, డీహైడ్రేషన్ నివారణ చర్యలు మరియు హీట్ స్ట్రోక్ లక్షణాలపై కార్మికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించవలెనని తెలిపారు. అధిక ప్రమాదానికి గురయ్యే బహిరంగ కార్మికులను గుర్తించి, భారత వాతావరణ శాఖ సూచనలు మరియు హీట్ మ్యాప్స్ ఆధారంగా ప్రత్యేక జాగ్రత్త చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆరోగ్య సంబంధిత అన్ని ప్రామాణిక చికిత్స విధానాలను ఖచ్చితంగా అనుసరించాలని సూచించారు. వేడి సంబంధిత వ్యాధుల నివారణకు సంబంధించిన పోస్టర్లు, సూచనలు మరియు ప్రచార సమాచారాన్ని కార్యాలయాలు మరియు పనిస్థలాలలో తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వలస కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని "ఇంటర్ స్టేట్ మైగ్రెంట్ వర్కర్స్ (ఉపాధి నియంత్రణ మరియు సేవా నిబంధనలు) చట్టం, 1979"లో పేర్కొన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత యాజమాన్యాలను ఆదేశించారు. కావున, దుకాణాలు, సంస్థలు, ఫ్యాక్టరీలు మరియు నిర్మాణ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు మరియు వారి యాజమాన్యాలు పై సూచనలను తప్పనిసరిగా పాటించి, కార్మికులను అధిక ఉష్ణోగ్రతల ప్రభావం నుండి రక్షించి వారి ఆరోగ్యాన్ని కాపాడవలసిందిగా జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి విజ్ఞప్తి చేశారు.

రికార్డు స్థాయిలో చికెన్ ధరలు

సామాన్యునికి దరికి చేరని చికెన్

కెజీ రూ.350 నుంచి రూ.400 వరకు ధర

అమరావతి (ఉషశ్రీ) మే 13: చికెన్ ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడంతో సామాన్యులకు నాన్‌వెజ్ భారంగా మారుతోంది. వేసవి ఎండలు, పెళ్లిళ్ల సీజన్, బాయిలర్ కోళ్ల ఉత్పత్తి తగ్గుదల కలిసి మార్కెట్‌లో ధరలను అమాంతం పెంచేశాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం స్కిన్‌లెస్ చికెన్ ధర కిలోకు రూ.350 నుంచి రూ.400 వరకు పలుకుతోంది. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో గత వారం రోజుల్లోనే చికెన్ ధరలు భారీగా పెరిగాయి. సాధారణంగా రూ.220-250 మధ్య ఉండే ధరలు ప్రస్తుతం రూ.340-370కు చేరాయి. కొన్ని ప్రాంతాల్లో రూ.400 దాటినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. పౌల్ట్రీ రైతులు చెబుతున్న వివరాల ప్రకారం, ఎండల తీవ్రత కారణంగా బాయిలర్ కోళ్లు సరైన బరువు పెరగడం లేదు. సాధారణంగా 2.5 నుంచి 3 కిలోల వరకు పెరిగే కోళ్లు ఇప్పుడు 1.5 నుంచి 1.75 కిలోలకే పరిమితమవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల కోళ్ల మరణాలు కూడా పెరుగుతున్నాయి. దీంతో రైతులు కొత్త బ్యాచ్‌ల పెంపకాన్ని తగ్గిస్తున్నారు. ఇంకొకవైపు మొక్కజొన్న, సోయా వంటి ఫీడ్ ధరలు పెరగడం కూడా రైతులకు భారంగా మారింది. నిర్వహణ ఖర్చులు పెరగడంతో చాలా మంది రైతులు పౌల్ట్రీపై ఆసక్తి తగ్గించుకున్నారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీంతో మార్కెట్‌లో సరఫరా తగ్గి, డిమాండ్ పెరగడంతో ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. రంజాన్, పెళ్లిళ్ల సీజన్, ఫంక్షన్ల డిమాండ్ కూడా చికెన్ ధరల పెరుగుదలకు మరో ప్రధాన కారణంగా మారింది. హోటళ్లు, ఫంక్షన్ హాళ్ల నుంచి భారీ ఆర్డర్లు రావడంతో మార్కెట్‌లో చికెన్ కొరత ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు. పౌల్ట్రీ ఫెడరేషన్ అంచనాల ప్రకారం, వేసవిలో ఉత్పత్తి 20 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. జూన్ చివరి వరకు ఎండలు కొనసాగితే చికెన్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. వర్షాలు ప్రారంభమై ఉష్ణోగ్రతలు తగ్గితేనే ధరలు స్థిరపడే అవకాశముందని చెబుతున్నారు.

"నా నగరం - నా బాధ్యత" భావనతో ముందుకు రావాలి : కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ,(ఉషశ్రీ)మే 13: నగర పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, "నా నగరం -- నా బాధ్యత" అనే భావనతో ప్రజలు ముందుకు రావాలని కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. బుధవారం బీఆర్‌టీఎస్ రోడ్ ఫుడ్ జంక్షన్ నుంచి భగత్‌సింగ్ రోడ్ వరకు కాలినడకన పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షణ--2026లో భాగంగా ప్రత్యేక శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ స్వయంగా చీపురు పట్టుకుని రహదారులను శుభ్రం చేశారు. కాలుష్య రహిత నగర నిర్మాణం కోసం ఎండ్ టు ఎండ్ రోడ్ల అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, వేడి ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లలో వడ్డించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. 120 మైక్రోన్స్ కంటే తక్కువ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని అధికారులకు ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్థాలను కాలువల్లో వేయకుండా ప్రజలు నగరపాలక సంస్థకు అప్పగించాలని, వాటితో ఫీవర్ బ్లాక్స్ వంటి ఉపయోగకర వస్తువులు తయారు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అర్జున రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

సమాధాన్ సమరోహ్‌కు కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ

జిల్లా చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా న్యాయాధికారి జీ గోపి

మచిలీపట్నం,(ఉషశ్రీ)మే 13: దేశవ్యాప్తంగా వివాదాల సామరస్య పరిష్కారానికి నిర్వహిస్తున్న "సమాధాన్ సమరోహ్ ఏప్రిల్ 2026" కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించనున్నట్లు, కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రిన్సిపల్ న్యాయాధికారి జీ గోపి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ నెల 21, 22, 23 తేదీలలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భారత్ అంతటా ఉన్న న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ అంశాలకు సంబంధించిన కేసులను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని, ప్రత్యేక లోక్ అదాలత్‌లో న్యాయవాదులు మరియు కక్షిదారులు చురుకుగా పాల్గొని, తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు. కేసుల వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను గూగుల్ ఫారం ద్వారా నమోదు చేయాలని సూచించారు. గూగుల్ ఫారం నింపేందుకు చివరి తేదీ మే 31 గా నిర్ణయించినట్టు తెలిపారు. సహాయం లేదా సమాచారం కోసం సుప్రీంకోర్టు వార్ రూమ్‌లోని "వన్ స్టాప్ సెంటర్"ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఒంగోలులో 'అమర్ హాస్పిటల్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యేలు దామచర్ల, ముత్తుముల

ఒంగోలు : ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలోని సౌత్ బైపాస్ జంక్షన్, ప్రగతి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "అమర్ హాస్పిటల్స్" ప్రారంభోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ మరియు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఆసుపత్రిని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఒంగోలు నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇలాంటి అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం హర్షణీయమని కొనియాడారు. స్థానిక ప్రజలకు మెరుగైన మరియు నాణ్యమైన చికిత్సను సామాన్యులకు సైతం అందుబాటు ధరల్లో తెచ్చినందుకు ఆసుపత్రి యాజమాన్యాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు. అత్యాధునిక పరికరాలతో కూడిన ఈ ఆసుపత్రి ద్వారా ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువవుతాయని ఆకాంక్షించారు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మితే ట్రేడ్ లైసెన్స్ రద్దు వీఎంసీ హెచ్చరిక

విజయవాడ, మే 13: నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నమని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించే వ్యాపారుల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని వీఎంసీ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు హెచ్చరించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఆదేశాల మేరకు నగరంలోని అన్ని డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. బుధవారం శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, సెక్రటరీలతో కలిసి పలు షాపులపై తనిఖీలు నిర్వహించి 15 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని రూ.15,400 జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువులు పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తాయని, ముఖ్యంగా 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలవక కాలుష్యానికి కారణమవుతున్నాయని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు పర్యావరణహిత వస్తువుల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులు, పేపర్ కవర్లు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వీఎంసీ అధికారులు తెలిపారు.

ఓవర్ లోడ్ టిప్పర్ల పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఫైర్

- రోడ్లు పాడు చేస్తూ, ప్రజల ప్రాణాలతో ఆటలాడితే సహించేది లేదు
- హెచ్చరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

గుంటూరు, ఉషశ్రీ: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో పరిమితికి మించి అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీలు రోడ్లు పాడు చేస్తూ, ప్రజల ప్రాణాలతో ఆటలాడితే సహించబోమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తేల్చిచెప్పారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి క్యాంప్ కార్యాలయంలో నగరంలో భారీ లోడ్ల టిప్పర్ లారీలు, ఓవర్‌లోడ్ వాహనాల సంచారం, రోడ్ల ధ్వంసం, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులపై పలు శాఖల అధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మైనింగ్ డీడీ చంద్రశేఖర్, ఆర్టీఓ అధికారులు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఆర్ ఉ బీ డీఈ, నగరపాలక సంస్థ డీఈలు, ట్రాఫిక్ ఎస్ఐ, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని ఎస్‌వీఎన్ కాలనీ, అమరావతి రోడ్, పట్టాభిపురం బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో సమయపాలన లేకుండా భారీ లోడ్ల టిప్పర్లు ఇష్టానుసారంగా తిరుగుతున్నాయని, పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ అధికారులు కేవలం బోర్డులు పెట్టడం తప్ప కఠిన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. టిప్పర్ సామర్థ్యం 22 నుంచి 28 టన్నుల వరకు ఉంటే, 50 నుంచి 60 టన్నుల వరకు లోడ్లు ఎలా తీసుకెళ్తున్నారు? ఇది ఎవరి అనుమతితో జరుగుతోంది? ఏ శాఖ పర్యవేక్షణలో ఉంది?" అంటూ ఎమ్మెల్యే అధికారులను నిలదీశారు. రోడ్ల మధ్యలో ఇసుక, కంకర కారుతూ వెళ్లడం వల్ల ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలే కోట్ల రూపాయలతో వేసిన బీటీ రోడ్లు భారీ లోడ్ల వాహనాలతో పూర్తిగా ధ్వంసమవుతున్నాయని అన్నారు. "రోడ్లు పాడవ్వడం నిమిషాల పని... వాటిని బాగుచేయడం కోసం నెలలు, సంవత్సరాలు పడుతోంది. చివరికి ప్రజలు ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను తప్పుపడుతున్నారు" అని ఆదేదన వ్యక్తం చేశారు. ఓవర్‌లోడ్ వాహనాలపై చర్యలు తీసుకోవడంలో శాఖల మధ్య సమన్వయం లేకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఒక్క శాఖ మరొక శాఖపై నెట్టేస్తే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయి? ప్రజలకు సమాధానం ఎవరు చెబుతారు?" అంటూ ప్రశ్నించారు. అదేవిధంగా నగర పరిధిలో ఖాళీ స్థలాల్లో అక్రమంగా ఇసుక డంపింగ్ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఫిర్యాదులు ఇచ్చినా సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. పలు ప్రాంతాల్లో గుంతలు పూడ్చటం లేదని, నాసిరకం రోడ్డు మరమ్మతులపై కూడా ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ప్రతి సమస్యను ప్రజాప్రతినిధులే గుర్తించి చెప్పాలా? అధికారులు స్వయంగా పర్యవేక్షణ చేయరా?" అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. నగరంలో భారీ లోడ్ల వాహనాలకు కఠిన సమయ పరిమితులు విధించాలి నగరంలోకి ఓవర్‌లోడ్ టిప్పర్ల ప్రవేశాన్ని నియంత్రించాలి చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ చేపట్టాలి అక్రమ ఇసుక డంపింగ్ కేంద్రాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి రోడ్ల నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి ప్రజల ప్రాణాలతో ఆటలాడే విధంగా ఎలాంటి నిర్లక్ష్యం సహించం. అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

రిటైర్డ్ ఆప్కాస్ కార్మికుల ఐ ఎఫ్ ఎం ఎస్ ఐడీలు తొలగించాలి : ఏఐటీయూసీ

విజయవాడ, (ఉషశ్రీ) మే 13 : రిటైర్డ్ అయిన ఆప్కాస్ కార్మికుల ఐడీలను వెంటనే తొలగించాలని ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దే రాజా వీఎంసీ అధికారులను కోరారు. 12వ డివిజన్ వినాయకనగర్ సానిటరీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ గత ఏడాది మార్చి నుంచి డిసెంబర్ వరకు మూడు విడతలుగా సుమారు 250 మందికి పైగా వివిధ కేటగిరీలలో ఆప్కాస్ కార్మికులు రిటైర్ అయినప్పటికీ, వారి ×ఖీమీ ఐడీలను ఇప్పటివరకు తొలగించలేదని ఆరోపించారు. దీంతో వృద్ధాప్య పెన్షన్ సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కార్మికులు కోల్పోతున్నారని తెలిపారు. జీవితాంతం కష్టపడి పనిచేసిన కార్మికులు అధికారుల నిర్లక్ష్యానికి బలవుతున్నారని విమర్శించారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రిటైర్డ్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎస్ వి ఎస్ చలం తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం : కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ జిల్లా, (ఉషశ్రీ)మే 13: విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యంగా జిల్లాలో 50 సమ్మర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు జి . లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో క్యాంపులకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 27 క్రీడా విభాగాల్లో ఈ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్న కలెక్టర్, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం లక్ష్మీనరసింహం , జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కే . కోటేశ్వర రావు , డీఈవో. చంద్రకళ , జిల్లా యువజన సంక్షేమ అధికారి కొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రులు, కార్యాలయాల్లో ఫైర్ ఆడిట్ నిర్వహించాలి

గుంటూరు, ఉషశ్రీ: ఆసుపత్రులు, కార్యాలయాల్లో ఫైర్ ఆడిట్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ ఆదేశించారు. మంగళ, బుధవారాలలో జరిగిన అగ్ని ప్రమాదాలు దృష్ట్యా బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైర్ ఆడిట్ నిర్వహించాలని అన్నారు. ఫైర్ ఆడిట్ తో పాటు ఆసుపత్రిలో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి నెల ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచిం చారు. ఫైవ్ ఆడిట్ లో కనుగొన్న లోపాలను సంబంధిత ఆసుపత్రిలు, కార్యాలయాలు తక్షణం పునరుద్ధరణ చేయాలని పేర్కొన్నారు. అగ్నిమాపక పరికరాల ఎక్స్పైరీ డేట్ ను కూడా విధిగా పరిశీలించాలని ఆయన ఆదేశించారు. వేసవి తీవ్రత ఉందని ఈ సమయంలో విద్యుత్తు ఉపకరణాలు వినియోగం అధికంగా ఉంటుందని విద్యుత్ లోడుకు తగిన విధంగా లేనట్లయితే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంటుందని పేర్కొంటూ అటువంటి లోపాలు కనుగొనుటకు విద్యుత్ ఆడిట్ ను నిర్వహించాలని ఆదేశించారు. మునిసిపల్, పంచాయతీ పరిధిలలో చెత్త సేకరణ పక్కాగా జరగాలని ఆదేశించారు. చెత్త అనేక ప్రాంతాల్లో కాల్చడం జరుగుతుందని అటువంటి పద్ధతులను అవలంబించే రాదని ఆదేశించారు. మునిసిపల్ పరిధిలో చెత్త శుభ్రత కార్యక్రమం రహదారుల కు మాత్రమే పరిమితం కాకుండా పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉండుటకు చర్యలు చేపట్టాలని సూచించారు.

మీడియా వార్తతో ప్రయోజనం: గత నెలలో అగ్ని ప్రమాదాలపై మీడియాలో ప్రచురితమైన ఒక వార్త బాగా ఉపయోగపడిందని జిల్లా కలెక్టర్ అన్నారు. వార్త సమాచారంతో వెంటనే అగ్నిమాపక అధికారికి ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆ మేరకు జి జి హెచ్ లో మాకు డ్రిల్ నిర్వహణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఈ మార్క్ డ్రిల్ కార్యక్రమం మంగళవారం జరిగిన అగ్ని ప్రమాద నివారణకు ఎంతగానో తోడ్పడిందని అన్నారు. ప్రజల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

జి.జి.హెచ్ ను తనిఖీ చేసిన కలెక్టర్: జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం తనిఖీ చేసి ప్రమాద సంఘటనపై ఆరా తీశారు. సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని, అగ్నిమాపక వ్యవస్థ పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పల నాయుడు, ఎ.పి.ఎం.ఎస్.ఐ.డి.సి కార్యనిర్వహక ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి భవిష్యత్‌లో ప్రపంచ స్థాయి హెల్త్ క్యాపిటల్‌గా ఎదుగుతుంది

కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు,ఉషశ్రీ: గుంటూరు జిల్లా నిడమర్రులో బొలినేని మెడికల్ కాలేజీ మరియు స్కిల్ డెవలెప్మెంట్ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాటిన విత్తనం భవిష్యత్తులో మహావృక్షంగా మారబోతోందన్నారు. మానవ జీవితాలను మార్చగలిగే శక్తి ఉన్న ఆరోగ్య వ్యవస్థకు కిమ్స్ రూపకల్పన నాంది పలుకుతోందన్నారు. మెడికల్ కాలేజీలు, అలైడ్ హెల్త్ సైన్సెస్, నర్సింగ్, ఫార్మాకాలజీ, డెంటల్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ రంగాల సమగ్ర అభివృద్ధితో అమరావతి ఒక స్కిల్ క్యాపిటల్‌గా, హెల్త్ క్యాపిటల్‌గా ఎదుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఒక రోగి చికిత్సలో వైద్యులతో పాటు నర్సులు, ఫిజియోథెరపిస్టులు, ఇతర వైద్య సిబ్బంది సమన్వయం ఎంతో కీలకమని, ఇంటిగ్రేటెడ్ కేర్ వ్యవస్థ ఉన్న ప్రాంతాల్లో వైద్య ఫలితాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. అమెరికాలోని మయో క్లినిక్, క్లీవ్‌ల్యాండ్ క్లినిక్‌ల వంటి సంస్థలు దశాబ్దాల దూరదృష్టి, సంకల్పంతో ఎదిగాయని పేర్కొన్న ఆయన, అమరావతిలో కూడా అలాంటి ప్రపంచ స్థాయి వైద్య వ్యవస్థ ఏర్పడేందుకు పునాది వేస్తున్నామని తెలిపారు. ప్రపంచ మెడికల్ టూరిజం విలువ 70-80 బిలియన్ డాలర్ల వరకు ఉందని, భారత్, థాయిలాండ్, సింగపూర్, మలేషియా ఈ రంగంలో ముందున్నాయని చెప్పారు. సరైన మౌలిక వసతులు, అంతర్జాతీయ విమానాశ్రయం, గ్రీన్ వాతావరణం ఉంటే అమరావతి కూడా ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం హబ్‌గా ఎదుగుతుందని వివరించారు. అమెరికాలో పనిచేస్తున్న వైద్యుల్లో 20-30 శాతం భారతీయులేనని, అందులో తెలుగువారు అధికంగా ఉన్నారని పేర్కొన్నారు. సరైన మౌలిక వసతులు కల్పిస్తే అమెరికాతో పోలిస్తే 70-80 శాతం తక్కువ ఖర్చుతోనే ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించవచ్చన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత యువ దేశమని, యువతకు సరైన నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటం టెక్నాలజీ ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుగానే గుర్తించి రాష్ట్రంలో క్వాంటం మిషన్ ప్రారంభించారని తెలిపారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో దేశంలోని ప్రముఖ సంస్థలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడంలో ముఖ్యమంత్రి చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఏపీలోనే 5వ తరం ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నాలజీ అభివృద్ధి లక్ష్యం అన్నారు. భారత్‌లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అమెరికా తర్వాత అత్యాధునిక 5వ తరం ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహకారంతో ప్రయత్నాలు జరుగుతున్నాయని సతీష్ రెడ్డి వెల్లడించారు. ఏఐ ఆధారిత వైద్య పరికరాల తయారీలో కిమ్స్ ముందంజ అన్నారు. కిమ్స్ హాస్పిటల్, రీసెర్చ్ ల్యాబొరేటరీ ద్వారా అందిస్తున్న సేవలను ప్రశంసించిన ఆయన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) ఆధారిత అత్యాధునిక కెమెరా అద్దాలను కేవలం రూ.6 వేలకే అందుబాటులోకి తీసుకురావడం విశేషమన్నారు. వైద్య పరికరాల తయారీలో విదేశాలపై ఆధారపడకుండా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంతో దేశీయ తయారీని ప్రోత్సహించాలన్నారు. పరిశోధన, తయారీ రంగాల అభివృద్ధితో భారీ ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. రీసెర్చ్, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలు అభివృద్ధి చెందితే రాష్ట్ర యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని సతీష్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అమరావతి రాజధానికి భూములు ఇచ్చిన రైతుల గౌరవార్థం ఆసుపత్రిలోని ప్రతి బ్లాక్‌లో గదులకు వారి పేర్లు పెడతామని తెలిపారు. హైదరాబాద్‌ను ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్ రంగాల్లో ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అమరావతిని కూడా అద్భుతమైన రాజధానిగా తీర్చిదిద్దాలని సంకల్పించారని అన్నారు.

30 వేల మంది రైతుల త్యాగం మరువలేనిది: సుమారు 30 వేల మంది రైతులు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణం కోసం ఇవ్వడం సాధారణ విషయం కాదని, అది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఉపాధి కల్పనపై సీఎం ప్రత్యేక దృష్టి: కిమ్స్ ఆసుపత్రి ప్రారంభోత్సవ సమయంలో "ఈ సంస్థ ద్వారా ఎంతమందికి ఉపాధి లభిస్తుంది?" అని ముఖ్యమంత్రి అడిగారని, ప్రజల సంక్షేమం, దేశాభివృద్ధిపై ఆయనకు ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. దార్శనిక నాయకత్వంతోనే సమాజంలో మార్పు సాధ్యం అన్నారు. సమాజంలో గొప్ప మార్పులు రావాలంటే చంద్రబాబు నాయుడు వంటి దూరదృష్టి కలిగిన నాయకత్వం అవసరమని బొలినేని భాస్కర్ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు గంటి హరీష్, మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, బొలినేని శ్రీనయ్య, అమరావతి రాజధానికి భూములు ఇచ్చిన రైతులు, మెడికల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పొదలకొండపల్లిలో ఫీడర్ కెనాల్ పునరుద్ధరణ పనుల పరిశీలన

గిద్దలూరు,ఉషశ్రీ.: గిద్దలూరుమండల పరిధిలోని పొదలకొండపల్లి గ్రామ పంచాయతీలో సాగునీటి సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో చేపట్టిన ఫీడర్ కెనాల్ పునరుద్ధరణ పనులను గిద్దలూరు ఎంపీడీవో కె సీతారామరావు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ?ఈ సందర్భంగా ఆయన పనుల నాణ్యతను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.కాలువ పూడికతీత మరియు పునరుద్ధరణ పనులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాలని, నాణ్యత విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని ఎంపీడీవో ఆదేశించారు. ఫీడర్ కెనాల్ పునరుద్ధరణ ద్వారా వర్షపు నీరు వృధా కాకుండా చెరువులకు, కుంటలకు సక్రమంగా చేరుతుందని, దీనివల్ల స్థానిక రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, సాధ్యమైనంత త్వరగా ఈ పనులను పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.

ఎండ బాధ

మండుతున్న ఎండలతో ప్రజల్లో ఆందోళన
వృద్ధులు, చిన్నారులపై తీవ్ర ప్రభావం
శరీరంలో నీటి శాతం తగ్గితే ప్రమాదమే
మధ్యాహ్నం బయటకు వెళ్లడంపై హెచ్చరికలు
స్ట్రోక్ లక్షణాలను ముందుగానే గుర్తించాలి
ఆహారపు అలవాట్లలో మార్పులు అవసరం
చల్లని పానీయాల పేరుతో మోసపోవద్దు
ఇంట్లోనే పాటించాల్సిన జాగ్రత్తలు
వైద్యులు సూచిస్తున్న కీలక సూచనలు
అప్రమత్తతే ప్రాణరక్షణకు మార్గం



ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రస్తుతం ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం తొమ్మిది గంటలు దాటకముందే సూర్యుడు నిప్పులు చెరుగుతున్నట్టుగా పరిస్థితి మారుతోంది. మధ్యాహ్న సమయాల్లో రోడ్లు వెలవెలబోతుండగా, ప్రజలు అత్యవసర పనులు తప్ప బయటకు రావడానికి కూడా భయపడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్, అడవుల తగ్గుదల, కాలుష్యం వంటి అనేక కారణాల వల్ల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటి ప్రమాదకర స్థాయికి చేరుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

ఇటీవల కాలంలో వేసవి కాలం అంటే కేవలం చెమటలు పట్టడం మాత్రమే కాదు, ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితిగా మారింది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. దీనివల్ల శరీరంలోని నీటి శాతం వేగంగా తగ్గిపోతుంది. శరీరం సహజంగా ఉష్ణోగ్రతను నియంత్రించుకునే శక్తి కోల్పోతే హీట్ స్ట్రోక్ వంటి ప్రమాదాలు సంభవిస్తాయి. చిన్నారులు తమ శరీరంలో మార్పులను సరిగా చెప్పలేరు. వృద్ధుల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో వేడి ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. వైద్యుల ప్రకారం, వేసవిలో ముఖ్యంగా మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యంత ప్రమాదకర సమయం. ఈ సమయంలో బయట తిరగడం తగ్గించాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, కాటన్ బట్టలు తప్పనిసరిగా ఉపయోగించాలి. ముఖాన్ని, తల భాగాన్ని కప్పుకోవడం ద్వారా నేరుగా ఎండ తాకకుండా చూసుకోవాలి.

చిన్నపిల్లలను ఈ సమయంలో బయట ఆడనివ్వకపోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. వృద్ధుల్లో ఇప్పటికే బీపీ, షుగర్, గుండె సంబంధిత సమస్యలు ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఎండల ప్రభావంతో ఈ సమస్యలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. శరీరంలో నీటి కొరత ఏర్పడితే రక్తపోటు మార్పులు చోటుచేసుకుంటాయి. కొంతమందిలో తల తిరగడం, కళ్లు తిరగడం, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ పరిస్థితిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం కూడా సంభవించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలి. పిల్లలు ఆడుకుంటూ నీరు తాగడం మర్చిపోతుంటారు. దీంతో డీహైడ్రేషన్ త్వరగా వస్తుంది. తరచూ నీరు, కొబ్బరి నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటి సహజ ద్రవాలను ఇవ్వాలి. కూల్ డ్రింక్స్, అధిక చక్కెర కలిగిన పానీయాలు ఆరోగ్యానికి మంచివి కావని నిపుణులు చెబుతున్నారు. ఇవి తాత్కాలికంగా చల్లదనాన్ని ఇచ్చినా, శరీరానికి అవసరమైన పోషకాలు అందించవు. ఎండల సమయంలో ఆహారపు అలవాట్లలో కూడా మార్పులు చేసుకోవాలి. ఎక్కువ మసాలా, వేయించిన పదార్థాలు తగ్గించడం మంచిది. పుచ్చకాయ, కర్బూజ, దోసకాయ, మామిడి, నారింజ వంటి నీటి శాతం అధికంగా ఉన్న పండ్లు తీసుకోవాలి. తేలికపాటి ఆహారం తీసుకోవడం వల్ల శరీరం త్వరగా అలసిపోదు. రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల వరకు నీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. దాహం లేకపోయినా కొద్దికొద్దిగా నీరు తాగడం అలవాటు చేసుకోవాలి. ఇంటి వాతావరణాన్ని కూడా చల్లగా ఉంచుకోవడం అవసరం. కిటికీలు తెరిచి గాలి ఆడేలా చూడాలి. మధ్యాహ్న సమయంలో కర్టెన్లు వేయడం ద్వారా ఇంట్లోకి వేడి తగ్గించవచ్చు. చిన్నపిల్లలు, వృద్ధులు ఉన్న గదుల్లో ఫ్యాన్ లేదా కూలర్ సరిగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలి. అధిక వేడి ఉన్న ప్రాంతాల్లో రోజులో కొన్ని గంటలు విద్యుత్ కోతలు కూడా ఉంటుండటంతో ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకోవడం మంచిది.

హీట్ స్ట్రోక్ లక్షణాలను ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యం. అధిక జ్వరం, చెమటలు ఆగిపోవడం, శరీరం వేడెక్కిపోవడం, వాంతులు, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. బాధితుడిని చల్లని ప్రదేశానికి తరలించి నీరు ఇవ్వాలి. తలపై చల్లని గుడ్డలు పెట్టడం ద్వారా శరీర ఉష్ణోగ్రత తగ్గించే ప్రయత్నం చేయాలి. అయితే పరిస్థితి తీవ్రమైతే ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తరలించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా కనిపిస్తోంది. వ్యవసాయ పనులు, కూలి పనుల కోసం బయట పనిచేసేవారు తీవ్రమైన ప్రమాదంలో ఉంటున్నారు. చాలామంది బలవంతంగా మండుటెండలో పనిచేయాల్సి వస్తోంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కలిసి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజారోగ్య నిపుణులు చెబుతున్నారు. పంచాయతీ స్థాయిలో తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయడం, బస్ స్టాండ్లు, మార్కెట్ ప్రాంతాల్లో నీడ కల్పించడం వంటి చర్యలు అవసరమని సూచిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లల విషయంలో కూడా జాగ్రత్తలు తప్పనిసరి. పిల్లలు తప్పనిసరిగా వాటర్ బాటిల్ తీసుకెళ్లేలా చూడాలి. స్కూల్ యాజమాన్యాలు మధ్యాహ్న సమయంలో బహిరంగ క్రీడలను తగ్గించాలి. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే స్కూల్ టైమింగ్స్ మార్చిన ఘటనలు ఉన్నాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వేసవి సెలవులను ముందుగానే ప్రకటించే పరిస్థితులు కూడా వస్తున్నాయి.

వృద్ధులు ఒంటరిగా ఉంటే పరిస్థితి మరింత ప్రమాదకరం. చాలాసార్లు వారికి దాహం అనిపించకపోయినా శరీరం నీటిని కోల్పోతూనే ఉంటుంది. కుటుంబ సభ్యులు తరచూ నీరు తాగుతున్నారా లేదా గమనించాలి. వృద్ధులకు మందులు వాడే అలవాటు ఉంటే, వేసవిలో వాటి ప్రభావం ఎలా ఉంటుందో వైద్యులను అడిగి తెలుసుకోవాలి. కొన్ని మందులు శరీరంలో నీటి శాతం తగ్గించే అవకాశం ఉంటుంది. ఎండల సమయంలో బయట నిలిపిన వాహనాల్లో చిన్నపిల్లలను లేదా పెంపుడు జంతువులను వదిలేయడం చాలా ప్రమాదకరం. వాహనం లోపలి ఉష్ణోగ్రత కేవలం కొన్ని నిమిషాల్లోనే ప్రమాదకర స్థాయికి చేరుతుంది. ఇది ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ ప్రజలు మాత్రమే కాదు, ప్రభుత్వ యంత్రాంగం కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఆస్పత్రుల్లో ప్రత్యేక హీట్ స్ట్రోక్ వార్డులు ఏర్పాటు చేయడం, అంబులెన్స్ సేవలను సిద్ధంగా ఉంచడం, గ్రామాల్లో అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపట్టాలి. వాతావరణ శాఖ హెచ్చరికలను ప్రజలకు వేగంగా చేరవేయడం కూడా చాలా ముఖ్యం.

చాలామంది ఎండ నుంచి ఉపశమనం కోసం ఐస్ క్రీములు, చల్లని పానీయాలవైపు మొగ్గుచూపుతున్నారు. అయితే వీటిని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. సహజ పానీయాలైన మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు. శరీరానికి అవసరమైన లవణాలు, ఖనిజాలు ఇవి అందిస్తాయి. ఎండల కారణంగా మానసిక ఒత్తిడి కూడా పెరుగుతుంది. అధిక వేడి వల్ల చిరాకు, అలసట, నిద్రలేమి వంటి సమస్యలు వస్తాయి. చిన్నపిల్లలు ఎక్కువగా ఏడవడం, వృద్ధులు అసహనంగా ప్రవర్తించడం కూడా కనిపించవచ్చు. అందువల్ల ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో సిమెంట్ నిర్మాణాలు అధికంగా ఉండటం వల్ల వేడి మరింత పెరుగుతోంది. చెట్లు తగ్గిపోవడం కూడా మరో ప్రధాన కారణం. నిపుణులు చెబుతున్నదేమిటంటే ప్రతి కుటుంబం కనీసం కొన్ని మొక్కలు నాటితే భవిష్యత్తులో ఉష్ణోగ్రతలను కొంతవరకు తగ్గించే అవకాశం ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ కూడా ఎండల తీవ్రత తగ్గించడ[illegible]క పాత్ర పోషిస్తుంది. చాలామంది ఎండలోనుంచి వచ్చాక వెంటనే చల్లని నీరు తాగడం లేదా వెంటనే స్నానం చేయడం చేస్తుంటారు. ఇది కొన్నిసార్లు శరీరంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని తర్వాత నీరు తాగడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే ఒకేసారి ఎక్కువగా నీరు తాగకుండా కొద్దికొద్దిగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారిని కుటుంబ సభ్యులు జాగ్రత్తగా చూసుకోవాలి. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చు. ఎండల తీవ్రతను తక్కువ అంచనా వేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అప్రమత్తత, సరైన ఆహారం, తగినంత నీరు, సమయానికి విశ్రాంతి --- ఇవే మండుతున్న ఎండల నుంచి మనలను రక్షించే ప్రధాన ఆయుధాలు. ప్రస్తుతం ప్రతి కుటుంబం ఈ విషయాన్ని గంభీరంగా తీసుకుని జాగ్రత్తలు పాటిస్తే వేసవి కాలాన్ని సురక్షితంగా గడపవచ్చు.

కేకేఆర్‌పై కింగ్ క్లాస్ షో...

- విరాట్ కోహ్లి ఐపీఎల్‌లో 9వ సెంచరీ
- 58 బంతుల్లో శతకం బాదిన కోహ్లి
- కేకేఆర్‌పై ఆర్సీబీ ఘన విజయం
- పాయింట్ల పట్టికలో టాప్‌కు చేరిన ఆర్సీబీ

ది రన్ మెషీన్ విరాట్ కోహ్లి ఐపీఎల్‌లో తన తొమ్మిదో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రాయ్‌పూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై సెంచరీ బాదాడు. 32 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న కోహ్లి 58 సెంచరీ పూర్తి చేశాడు. విరాట్ కోహ్లి క్లాస్ ఇన్నింగ్స్‌తో భారీ టార్గెట్‌ను ఆర్సీబీ ఆడుతూ పాడుతూ ఛేదించింది. కోహ్లి వన్ మ్యాన్ షోతో రాణించడంతో ఆర్సీబీ ఓవర్లలో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కేకేఆర్ 20 ఓవర్లలో 192/4 చేయగా.. ఆర్సీబీ ఓవర్లలో చేసి విజయం సాధించింది. రాయ్‌పూర్ టీ20లో విరాట్ కోహ్లి క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. భారీ స్కోర్ ఛేజింగ్‌లో విరాట్ కోహ్లి కీలక ఇన్నింగ్స్ ఆడి శతకం బాదాడు. 32 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న కోహ్లి, 58 బంతుల్లోనే సెంచరీ నమోదు చేసి తన క్లాస్ టచ్ ఏంటో కేకేఆర్ బౌలర్లకు రుచి చూయించాడు. ఓపెనర్‌గా దిగి వికెట్ పడకుండా మ్యాచ్‌ని ఫినిష్ చేశాడు. ఈ విజయంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పాయింట్ల పట్టికలో మళ్లీ టాప్ ప్లేస్‌కి వచ్చేసింది. ఐపీఎల్ 2026లో భాగంగా రాయ్‌పూర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన రజత్ పటిదార్ బౌలింగ్ ఎంచుకుని కోల్‌కతా నైట్ రైడర్స్‌ను బ్యాటింగ్‌కి ఆహ్వానించాడు. ఆరంభంలో తడబడిన కేకేఆర్.. ఆ తర్వాత అంగ్‌క్రిష్ రఘువంశీ నిలదొక్కుకోవడంతో భారీ స్కోర్ దిశగా సాగింది. ఆఖర్లో రింకూ సింగ్ రాణించడంతో 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది.

కేకేఆర్ అందించిన 193 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి విరాట్ కోహ్లి అదిరిపోయే ఆరంభం ఇచ్చాడు. మరో ఓపెనర్ జేకబ్ బెతెల్ కూడా రాణించడంతో తొలి వికెట్‌కు 3.2 ఓవర్లలో 37 పరుగులు చేశారు. బెతెల్ 12 బంతుల్లో 15 పరుగులు చేసి అవుటయ్యాడు. దేవదత్ పడిక్కల్ క్రీజులోకి వచ్చిన తర్వాత స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. విరాట్ కోహ్లి – దేవదత్ పడిక్కల్ కేకేఆర్ బౌలర్లను ఒక ఆట ఆడుకున్నారు. పడిక్కల్ తన ఇన్నింగ్స్‌లో ఒక్క సిక్సర్ కూడా నమోదు చేయలేదు కానీ ఏడు బౌండరీలు బాదాడు. కోహ్లి – పడిక్కల్ కలిసి రెండో వికెట్‌కు 59 బంతుల్లో 92 పరుగులు నమోదు చేశారు. 27 బంతులు ఆడిన పడిక్కల్ ఏడు ఫోర్లతో 39 పరుగులు చేసి అవుటయ్యాడు. కెప్టెన్ రజత్ పటిదార్ 8 బంతుల్లో 11 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. టిమ్ డేవిడ్ కూడా 3 బంతుల్లో రెండు పరుగులు చేసి ఇలా వచ్చి అలా అవుటయ్యాడు. విరాట్ కోహ్లిని చాలా కాలంగా ఊరిస్తోన్న ఐపీఎల్ సెంచరీ మళ్లీ దక్కింది. 32 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న కోహ్లి 58 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 2024లో చివరిసారిగా ఐపీఎల్ సెంచరీ చేసిన కోహ్లి.. మళ్లీ ఈ ఏడాది శతకం బాదాడు. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో కోహ్లి తన 9వ సెంచరీ నమోదు చేసుకున్నాడు. కోహ్లి 60 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 105 పరుగులతో నాటౌట్‌గా నిలవడంతో ఆర్సీబీ ఓవర్లలో 193 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది.

వెంకటేశ్ అయ్యర్‌కి ఛాన్స్!

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు – కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. ప్లే ఆఫ్స్‌కు ముందు కీలకమైన ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ రెండు మార్పులు చేసింది. సుయాశ్ శర్మను పూర్తిగా బెంచ్‌కి పరిమితం చేసి, రొమారియో షెఫర్డ్‌ను ప్లేయింగ్ 11 నుంచి పక్కనబెట్టింది. ఆ ఇద్దరి స్థానాల్లో వెంకటేశ్ అయ్యర్, జేకబ్ డఫ్ఫీకి ప్లేయింగ్ 11లో చోటు ఇచ్చింది. ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు – కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ వర్షం కారణంగా ఆలస్యంగా మొదలైంది. రాత్రి 7 గంటలకు పడాల్సిన టాస్.. 8:30 గంటలకు వేశారు. వర్షం పడినప్పటికీ ఓవర్లలో ఎలాంటి మార్పు లేదు. 20 ఓవర్ల మ్యాచే అంపైర్లు నిర్ణయించారు. రాయ్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన రజత్ పటిదార్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దాంతో కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటింగ్‌కు రానుంది. ఇరు జట్లకు కీలకమైన ఈ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులో రెండు కీలక మార్పులు చేసింది. గత కొంతకాలంగా విఫలమవుతూ వస్తున్న రొమారియో షెఫర్డ్‌ను ప్లేయింగ్ 11 నుంచి తొలగించిన ఆర్సీబీ, సుయాశ్ శర్మను బెంచ్‌కే పరిమితం చేసింది. ఈ ఇద్దరి స్థానాల్లో వెంకటేశ్ అయ్యర్, జేకబ్ డఫ్ఫీలను జట్టులోకి తీసుకుంది. వెంకటేశ్ అయ్యర్ ప్లేయింగ్ 11లోకి రావడం ఇదే తొలి మ్యాచ్ కావడం విశేషం. ఈ ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉండగా.. కోల్‌కతా నైట్ రైడర్స్ ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. ఆర్సీబీ 11 మ్యాచ్‌లలో 7 గెలిచి 14 పాయింట్లతో కొనసాగుతోంది. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ గెలిస్తే ప్లే ఆఫ్స్ బెర్త్ దాదాపు ఖాయం చేసుకోవచ్చు. కేకేఆర్ 10 మ్యాచ్‌లలో నాలుగు గెలిచి 9 పాయింట్లతో కొనసాగుతోంది. ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టాలంటే కేకేఆర్ మిగతా నాలుగు మ్యాచ్‌లలో గెలవాల్సిందే. ఇక ఐపీఎల్‌లో హెడ్ టు హెడ్ రికార్డులలో ఆర్సీబీపై కేకేఆర్‌దే పైచేయి.

కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు: అజింక్య రహానే (కెప్టెన్), ఫిన్ అలెన్, కామెరూన్ గ్రీన్, అంగ్‌క్రిష్ రఘువంశీ, రోవ్‌మన్ పావెల్, మనీష్ పాండే, రింకూ సింగ్, సునీల్ నరైన్, అనుకుల్ రాయ్, వైభవ్ అరోరా, కార్తీక్ త్యాగి.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు: జేకబ్ బెతెల్, విరాట్ కోహ్లి, రజత్ పటిదార్ (కెప్టెన్), జితేశ్ శర్మ, టిమ్ డేవిడ్, వెంకటేశ్ అయ్యర్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, రసిక్ సలామ్ దార్, జేకబ్ డఫ్ఫీ, జోష్ హేజిల్‌వుడ్.

ట్రావిస్ హెడ్ అలా అవుటయ్యాడేంటీ..

- ట్రావిస్ హెడ్ విచిత్ర అవుట్‌తో మ్యాచ్ మలుపు
- సిరాజ్ బౌలింగ్‌కు సన్‌రైజర్స్ టాప్ ఆర్డర్ కుప్పకూలింది
- పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయిన హైదరాబాద్
- హెడ్ క్యాచ్ చూసి అభిషేక్ శర్మ కూడా షాక్
- 169 లక్ష్యానికి 86 పరుగులకే ఆలౌట్ అయిన ఎస్ఆర్‌హెచ్

గుజరాత్ టైటాన్స్ – సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లో ట్రావిస్ హెడ్ అవుటైన తీరు అందర్నీ అవాక్కయ్యేలా చేసింది. మొదటి మూడు బంతులు డాట్ బాల్స్ కాగా.. నాలుగో బంతిని షాట్ ఆడే ప్రయత్నం చేశాడు. లెగ్ సైడ్ ఆడిన ఆ షాట్ ఆఫ్ సైడ్ వెళ్లింది. అది కూడా బౌండరీ లైన్ దగ్గర క్యాచ్ లేవడంతో అందరూ షాక్ అయ్యారు. హెడ్ త్వరగా అవుటవ్వడంతో సన్‌రైజర్స్ పతనం మొదలై, ఓటమిపాలయింది. ఆశ్చర్యపరిచింది. అసలు షాట్ ఒకవైపు ఆడితే అది ఇంకో వైపు గాల్లో లేవడం ఎవ్వరికీ అర్థం కాలేదు. ట్రావిస్ హెడ్‌తో పాటు నాన్ స్ట్రయిక్‌లో ఉన్న అభిషేక్ శర్మ కూడా అవాక్కయ్యాడు. వరుసగా మూడు బంతులు డాట్ కాగా.. నాలుగో బంతికి షాట్ ఆడే ప్రయత్నంలో జరిగిన ఈ మిస్టేక్ మొత్తం మ్యాచ్ ఫలితాన్ని మార్చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు బలమంతా బ్యాటర్లే. అది కూడా ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్. ఈ ఇద్దరూ కాసేపు క్రీజులో ఉంటే మ్యాచ్ ఫలితమే మారిపోతుంది. పవర్ ప్లే వరకూ ఈ ఇద్దరూ అవుట్ కాకుండా ఉంటే స్కోర్ బోర్డు 90 పరుగులు రీచ్ అవడం చాలా ఈజీ. కానీ.. ఈ ఇద్దరూ పవర్ ప్లేలోనే అవుటైతే మ్యాచ్ దాదాపూ ఓడిపోయినట్టే లెక్క. అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా ఇదే జరిగింది. మొహమ్మద్ సిరాజ్ వేసిన తొలి ఓవర్‌లో ట్రావిస్ హెడ్ అష్టకష్టాలు పడ్డాడు. మొదటి బంతి నుంచే వికెట్ తీసుకోవాలన్న లక్ష్యంగా సిరాజ్ బౌలింగ్ చేశాడు. మొదటి రెండు బంతులను అవుట్ సైడ్ ఆఫ్ స్టంప్ వేయగా.. మూడో బంతిని వికెట్లకు వేశాడు. నాలుగో బంతిని ప్యాడ్స్ టార్గెట్‌గా వేయగా.. ట్రావిస్ హెడ్ దాన్ని షాట్ ఆడే ప్రయత్నం చేశాడు. హెడ్ లెగ్ సైడ్ షాట్ ఆడితే అది ఆఫ్ సైడ్ గాల్లోకి లేచింది. అదీ కూడా ఏదో మిడిల్‌లోనో, స్ట్రయిటో కాదు.. ఆఫ్ సైడ్ బౌండరీ దగ్గరకు వెళ్లింది. దాంతో అక్కడే ఫీల్డింగ్‌లో ఉన్న నిశాంత్ సింధూ ఆ బంతిని డైవ్ చేసి క్యాచ్ పట్టుకున్నాడు. హెడ్ అవుటైన తీరుకు నాన్ స్ట్రయిక్ ఎండ్‌లో ఉన్న అభిషేక్ శర్మ నోరెళ్లబెట్టాడు. అదేంటీ లెగ్ సైడ్ షాట్ ఆడితే అది ఆఫ్ సైడ్ బౌండరీ దగ్గరకు క్యాచ్ వెళ్లిందని అనుకున్నాడు. హెడ్ కూడా నిరాశగానే పెవిలియన్ బాట పట్టాడు. తొలి ఓవర్‌లోనే సున్నా పరుగులకు మొదటి వికెట్ కోల్పోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయింది. గుజరాత్ టైటాన్స్ పేస్ బౌలింగ్ దెబ్బకు ఆరెంజ్ ఆర్మీ కుదేలయింది. క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి కూడా అవుటవ్వడంతో అభిమానుల ఆశలు గల్లంతయ్యాయి. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కాసేపు ఇన్నింగ్స్‌ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేసినా లాభం లేకుండా పోయింది. దాంతో 169 పరుగుల లక్ష్యం ముందు 86 పరుగులకే ఆలౌట్ అయింది.

సీనియర్లకు చెక్ పెడుతోన్న రవితేజ!

ప్రస్తుతం మాస్ మహారాజా రవితేజ ఎలాంటి ఫేజ్ లో ఉన్నారో తెలిసిందే. గత కొంతకాలంగా రవితేజ నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను అందించలేదు. వరుసగా ఆరు పరాజయాలను చవిచూడటంతో రవితేజ సినిమా ఎంపికలో పంథాను పూర్తిగా మార్చుకుంటున్నారు. ఇకపై సీనియర్ దర్శకుల కంటే కూడా కొత్తదనం కోరుకునే యువ దర్శకులకే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించు కున్నట్లు ఫిలిం నగర్ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రస్తుతం రవితేజ తన 77వ చిత్రంగా శివ నిర్వాణ దర్శకత్వంలో –ఇరుముడి– అనే సినిమాలో నటిస్తున్నారు. బీటౌన్ పై సీరియస్ గా ఫోకస్ చేశారా? ఇ ాూనం ఎఎ ఈ చిత్రం అయ్యప్ప స్వామి మాల – ఆధ్యాత్మిక నేపథ్యంలో సాగే ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో రవితేజ మునుపెన్నడూ చూడని రీతిలో ఆధ్యాత్మిక ఛాయలున్న పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ లో విడుదలయ్యే అవకాశం ఉంది. శివ నిర్వాణ ప్రాజెక్ట్ ముగింపు దశకు రావడంతో? రవితేజ మరో ఇద్దరు టాలెంటెడ్ యువ దర్శకులను ఒకేసారి లైన్లో పెట్టడం విశేషం. –మత్తు వదలరా– వంటి విభిన్నమైన చిత్రంతో ఆకట్టుకున్న హసిత్ గోలీ దర్శకత్వంలో ఒక సినిమా చేసేందుకు జ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. హసిత్ గోలీ తనదైన శైలిలో రాసుకున్న ఓవినూత్నమైన కథాంశం రవితేజకు బాగా నచ్చడంతో ప్రాజెక్ట్ పట్టాలెక్కేందుకు సిద్ధంగా ఉంది. రవితేజ మార్కు ఎనర్జీకి హసిత్ మార్కు కామెడీ తోడైతే ఫలితం అదిరిపోతుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. మరోవైపు వైవిధ్యమైన సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అయిన వివేక్ ఆత్రేయతో కూడా రవితేజ చేతులు కలిపారు. వివేక్ ఆత్రేయ నిజానికి నందమూరి బాలకృష్ణ కోసం ఒక మాస్ కథను సిద్ధం చేసారు. కానీ ఇది పట్టాలెక్కడానికి ఇంకా సమయం పడు తుంది. ఈ గ్యాప్ లో రవితేజతో సినిమా చేయాలని ప్లాన్ చేస్తున్నాడు ఆత్రేయ. ఈ ప్రాజెక్టును కూడా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్నారు. వివేక్ ఆత్రేయ మేకింగ్ స్టైల్ , రవితేజ మాస్ అప్పీల్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. రవితేజ అనుసరిస్తున్న సరికొత్త వ్యూహం వెనుక ఓ బలమైన కారణం ఉంది. సీనియర్ దర్శకులు రొటీన్ ఫార్ములా కథలతో వస్తుం డటంతో? కుర్ర దర్శకులు ఇచ్చే సరికొత్త ఐడియాలు తన ఇమేజ్‌ను మళ్ళీ గాడిలో పెడతాయని రవితేజ నమ్ముతున్నారు. గతంలో కూడా రవితేజ ఎంతోమంది కొత్త దర్శకులను ప్రోత్సహించి బ్లాక్ బస్టర్ హిట్లు అందుకున్నారు. తాజాగా అదే పద్ధతిని మళ్ళీ అనుసరిస్తూ మార్కెట్‌ను నిలబెట్టుకోవడంతో పాటు ప్రేక్షకులకు విభిన్నమైన వినోదాన్ని పంచాలని పట్టుదలతో ఉన్నారు.

అభిమానులను మంత్రముగ్ధులను చేసింది

అందాల నటి మంజరి ఫడ్నిస్ తాజాగా ఎరుపు రంగు దుస్తుల్లో మెరిసిపోతూ అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. జలపాతం వద్ద కురిసే వర్షంలో తడుస్తూ ఆమె ఇచ్చిన హావభావాలు, చిరునవ్వు, సహజమైన అందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎరుపు రంగు వస్త్రధారణలో ఆమె ఉల్లాసంగా కనిపిస్తూ స్వేచ్ఛ, ఆనందం, సొగసును అద్భుతంగా ప్రతిబింబించింది. ఈ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మంజరి ఫడ్నిస్ తెరపై మాత్రమే కాకుండా బయట కూడా తన అందం, నటన, వ్యక్తిత్వంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తోంది. ముంబైలో 1988 జూలై 10న జన్మించిన ఆమె తన ప్రయాణాన్ని గాన కార్యక్రమ పోటీలో పాల్గొనడం ద్వారా ప్రారంభించింది. అనంతరం సినిమాల్లో అడుగుపెట్టి తక్కువ కాలంలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ఆమె తొలి చిత్రం "రోక్ సాకో తో రోక్ లో" కాగా, తరువాత వచ్చిన "జానే తు... యా జానే నా" చిత్రంతో విపరీతమైన ప్రజాదరణ పొందింది. ఆ చిత్రంలోని నటనకు ఉత్తమ నూతన ప్రతిభ అవార్డును కూడా అందుకుంది. తరువాత "గ్రాండ్ మస్తీ", "కిస్ కిస్కో ప్యార్ కరూన్", "బరోట్ హౌస్" వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకులను అలరించింది. జాతీయ పురస్కారం పొందిన బెంగాలీ చిత్రం "ఫాల్తు"లోనూ ఆమె నటన ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం మంజరి ఫడ్నిస్ చేతిలో పలు ఆసక్తికరమైన చిత్రాలు, వెబ్ సిరీస్‌లు ఉన్నాయి. "పుణే హైవే", "పెంట్ హౌస్", "జిందగీ నమకీన్" వంటి ప్రాజెక్టులతో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. తన అందం, అభినయం, చురుకుదనంతో ఆమె ఇంకా ఎన్నో విజయాలు సాధిస్తుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో సినీ తారలు!

- తమన్నా, సారా అర్జున్ మహాకాళేశ్వర దర్శనం
- భస్మహారతిలో పాల్గొన్న సినీ తారలు
- ఆధ్యాత్మికతతో ప్రశాంతత పొందుతున్న సమంత
- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న శ్రీలీల
- తల్లి భక్తి బాటలో జాన్వి కపూర్

సినిమా రంగం అంటేనే నిరంతరం షూటింగ్‌లు, గ్లామర్, ప్రయాణాలతో కూడిన ఉరుకుల పరుగుల జీవితం. వెండితెరపై మెరిసే తారలు వృత్తిపరమైన బాధ్యతలతో ఎంత బిజీగా ఉన్నా? మనశ్శాంతి కోసం ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తుంటారు. ఇటీవల కాలంలో టాలీవుడ్, బాలీవుడ్ భామలు వరుసగా పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. మొక్కులు తీర్చుకోవడమే కాకుండా అంతర్గత ప్రశాంతత కోసం, వ్యక్తిగత సవాళ్లను ఎదుర్కొనే శక్తి కోసం దైవ చింతనను ఆశ్రయించడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలోనే మిల్కీ బ్యూటీ తమన్నా, యువ నటి సారా అర్జున్ కలిసి మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయాన్ని సందర్శించారు. అక్కడ అత్యంత పవిత్రమైన భస్మహారతి సేవలో పాల్గొని శివుని ఆశీస్సులు అందుకున్నారు. తెల్లవారుజామునే జరిగే ఈ విశిష్ట పూజలో పాల్గొన్న ఇద్దరు సాధారణ భక్తుల మాదిరిగానే సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. విజయవంతమైన కెరీర్‌ను కొనసాగిస్తున్నా? దైవ దర్శనం తమకు ఎంతో సానుకూల శక్తిని అందిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్టార్ హీరోయిన్ సమంత జీవితంలోని క్లిష్ట పరిస్థితుల్లో ఆధ్యాత్మికతనే బలమైన ఆసరాగా చేసుకున్నారు. అనారోగ్య సమస్యలు, వ్యక్తిగత ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు భక్తి మార్గాన్ని ఎంచుకున్నారు. ఆలయాలను దర్శించడమే కాకుండా, ధ్యానం, యోగా , ఆధ్యాత్మిక ప్రసంగాల ద్వారా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటున్నారు. సమంత అనుసరిస్తున్న ఈ జీవనశైలి ఆమె అభిమానులకు కూడా ఒక స్ఫూర్తినిస్తోంది. ఎన్ని సమస్యలు ఎదురైనా ఆధ్యాత్మిక బలం ఉంటే ధైర్యంగా ముందుకు సాగొచ్చని నిరూపిస్తున్నారు. తెలుగు సినిమా రంగంలో నేటి క్రష్ శ్రీలీల సైతం భక్తి భావంలో ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. వరుస సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్న అమ్మడు ఇటీవల తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీనివాసుని పాదాల చెంత గడపడం వల్ల తనకు ఎనలేని ప్రశాంతత లభిస్తుందని భావిస్తారు. ఆధునిక కాలంలో కూడా సంస్కృతి, సంప్రదాయాలకు విలువ ఇస్తూ సమయం దొరికినప్పుడల్లా పుణ్యక్షేత్రాలకు వెళ్లే యువతరం తారల ధోరణి మెచ్చుకోదగ్గదిగా ఉంది. బాలీవుడ్ నటి జాన్వి కపూర్ తల్లి దివంగత శ్రీదేవి వారసత్వాన్ని ఆధ్యాత్మికంగానూ కొనసాగిస్తున్నారు. శ్రీదేవికి తిరుమల వెంకన్నపై ఉన్న అచంచలమైన భక్తిని పుణికిపుచ్చుకున్న జాన్వి ప్రతి ఏటా తిరుమల కొండకు చేరుకుంటారు. తన పుట్టినరోజు లేదా ముఖ్యమైన సినిమాల ప్రారంభోత్సవాల సమయంలో తిరుపతి వెళ్లడం ఆచారంగా మార్చుకున్నారు. తల్లి బాటలో నడుస్తూ దక్షిణాది సంప్రదాయాలను పాటిస్తున్న జాన్వి తీరు నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది. సినీ ప్రపంచం వెలుపల ఈ తారలు కూడా సామాన్యుల లాగే ప్రశాంతతను కోరుకుంటున్నారు. కెమెరా ముందు ఎన్ని పాత్రలు పోషించినా? దైవ సన్నిధిలో లభించే ఆనందం వెలకట్టలేనిదని అంతే బలంగా నమ్ముతారు. గ్లామర్ పరిశ్రమలో ఎన్ని ఆకర్షణలు ఉన్నా? ఆధ్యాత్మిక మార్గమే మనిషికి నిజమైన వికాసాన్ని ఇస్తుందని నటీమణులు నిరూపిస్తున్నారు. ఈ భక్తి ప్రయాణం వారికి వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగతంగానూ ఎంతో పరిణతిని అందిస్తోంది.

స్టార్ హీరోయిన్ రేంజ్ ఇలా కూడా రెట్టింపే!

ఏ నటికైనా స్టార్‌డమ్ అనేది వారు చేసే సినిమాల విజయంపై ఆధారపడి ఉంటుంది. కానీ చెన్నై బ్యూటీ త్రిష విషయంలో మాత్రం తాజా పరిణామాలు ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించాయి. గత కొంతకాలంగా త్రిష చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తోంది. ఆమె కెరీర్ ముగిసిపోయిందనుకున్న సమయంలో –పొన్నియిన్ సెల్వన్– , –లియో– వంటి చిత్రాలతో మళ్ళీ ఫామ్‌లోకి వచ్చింది. అయితే ఇప్పుడు ఆమె క్రేజ్ సినిమాలకు మించి రాజకీయ రంగు పులుముకోవడం విశేషం.ఇటీవల తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ దళపతి విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. బీటౌన్ పై సీరియస్ గా ఫోకస్ చేశారా? చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈ చారిత్రాత్మక వేడుకకు త్రిష హాజరుకావడం చర్చనీయాంశమైంది. కేవలం ఒక అతిథిగా మాత్రమే కాకుండా విజయ్ కుటుంబ సభ్యులతో ఆమె ఎంతో సాన్నిహిత్యంగా మెలుగుతూ కనిపించడం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యింది. ముఖ్యంగా విజయ్ తల్లి శోభను త్రిష ఆత్మీయంగా హత్తుకున్న వీడియోలు వైరల్ కావడంతో ఆమె స్టార్‌డమ్ ఒక్కసారిగా రెట్టింపయ్యింది. విజయ్ , త్రిషల ఆన్–స్క్రీన్ కెమిస్ట్రీకి కోట్లాది మంది అభిమానులు ఉన్నారు. –గిల్లి– నుంచి –లియో– వరకు ఇద్దరు తిరుగులేని జోడీ. బాక్సాఫీస్ వద్ద ఎన్నో రికార్డులను సృష్టించిన కాంబినేషన్ అది. ప్రస్తుతం విజయ్ రాజకీయాల్లో అఖండ విజయం సాధించి రాష్ట్ర పగ్గాలు చేపట్టడంతో? ఆయనకు అత్యంత ఆప్తురాలిగా త్రిషకు లభిస్తున్న గౌరవం ఆమె ఇమేజ్‌ను మరింత పెంచింది. నెటిజన్లు సైతం త్రిషను రియల్ లైఫ్ క్వీన్ అంటూ కొనియాడుతున్నారు. ఏ నటికీ లేని విధంగా ఒక ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార వేడుకలో త్రిష సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలవడం ఆమె డిమాండ్‌ను అమాంతం పెంచేసింది. సినిమా అవకాశాల విషయానికొస్తే? త్రిష ప్రస్తుతం సూర్య సరసన –కరుపు– , చిరంజీవి సరసన –విశ్వంభర– వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఈ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్న తరుణంలో, విజయ్ రాజకీయ విజయంతో ఆమెకు వస్తోన్న పాపులారిటీ ఈ సినిమాల బిజినెస్‌పై కూడా ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. నిర్మాతలు కూడా త్రిష ఉంటే సినిమాకు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుందని భావిస్తున్నారు. అందుకే ఆమె పారితోషికం కూడా భారీగా పెరిగినట్లు సమాచారం. అలాగే త్రిష రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం తరుపున ఆమె ప్రచారానికి రావొచ్చు లేదా భవిష్యత్తులో ఏదైనా బాధ్యత తీసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ రాజకీయ పరిణామాలు త్రిషను నటిగానే కాకుండా పవర్‌ఫుల్ పర్సనాలిటీగా మార్చాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో త్రిషకు ఉన్న ఫాలోయింగ్ , ఆమెపై జరుగుతున్న చర్చ చూస్తుంటే? త్రిష రేంజ్ సినిమాలకు అతీతంగా మారుతోందని చెప్పొచ్చు.

PRINTED, PUBLISHED, OWNED BY ILIPILLA MOHAN, D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, PRINTED AT GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001 P.H: 92950 03377,EMAIL: ushasri2025@gmail.com,RNI NO: APTEL/25/A4894,EDITOR: ILLIPILLA MOHAN